నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

1

మెదక్

బుధవారం | 06 మార్చి 2024 | www.navatelangana.com

ప్రమాదంలో గాయపడిన కుటుంబానికి రూ.3లక్షల సాయం




నవతెలంగాణ-జహీరాబాద్.

మండలంలోని దిడ్గి గ్రామానికి చెందిన సోనాయిల ప్రశాంత్ తన భార్య, పిల్లలతో బైక్‌పై వెళ్తూ రోడ్డు దాటుతుండగా కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దాంతో ప్రశాంత్‌కు బలంగా దెబ్బలు తగిలి కాలు కూడా విరిగిపోయింది. అంతేకాకుండా అతని భార్య, కుమార్తె పరిస్థితి విషమంగా ఉండడంతో మాదాపూర్ కిమ్స్ ఆసుపత్రులో చికిత్స పొందుతున్నారు. వారికి చికిత్సకు రూ.15 లక్షలు అవసరం ఉండగా.. దిడ్గి గ్రామస్తులు పస్తపూర్ వార్డులోని ఖిజర్ యాఫై దృష్టికి విషయాన్ని తీసుకొచ్చారు. దాంతో ఆయన వెంటన స్పందించి తనవంతుగా రూ.3లక్షల నగదును ప్రశాంత్ ఖాతాలో వేశారు. అంతేకాకుండా భవిష్యత్‌లోనూ అండగా ఉంటానని భరోసానిచ్చారు. అంతపెద్ద మొత్తంలో సాయం చేసిన యాఫైకి గ్రామస్తులు, సామాజిక సేవకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో.. అభ్యర్థుల వేట





- సిట్టింగ్ ఎంపీల్లో పార్టీ మారిన బీబీపాటిల్
- ఎమ్మెల్యేగా గెల్చిన కొత్త ప్రభాకర్‌రెడ్డి
- మెదక్, జహీరాబాద్ రెండు చోట్లా వెతుకులాటే
- కాంగ్రెస్, బీజేపీలను ఢీ కొనే అభ్యర్థులెవరు..?
- ఎంపీ టికెట్ కోసం డజన్ల కొద్ది దరఖాస్తులు

అధికార దర్పం చేజారితే ఎట్ల ఉంటదో బీఆర్ఎస్‌ను చూస్తే ఇట్టే అర్థమవ్వుద్ది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ మొదలు కింది స్థాయి కార్యకర్త వరకూ పదేళ్ల అధికార దర్పాన్ని ప్రదర్శించారనడంలో అతిశయోక్తిలేదు. గతం గతహా...అన్నట్లుగా ప్రస్తుతం ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థులను వెతుక్కోవాల్సి వస్తుంది. అధికార పార్టీగా ఉన్నప్పుడు ఎంపీ టికెట్లకు ఉన్న డిమాండ్ అంతా ఇంత కాదు. అధికారం పోయే సరికి అంతా చతికిల పడిపోయినట్టైంది. మెదక్, జహీరాబాద్ రెండు చోట్లా గులాబీ పార్టీ వరుస విజయాలు సాధించిన చరిత్ర ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో గెల్చిన ఇద్దరు సిట్టింగ్ ఎంపీలూ లేకుండా పోయారు. బీబీ పాటిల్ పార్టీకి గుడ్ బై చెప్పి ప్రత్యర్థి బీజేపీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నారు. కొత్త ప్రభాకరరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో రెండు చోట్ల కూడా ఎంపీగా పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువైన పరిస్థితి. టికెట్ కోసం డజన్ మంది వరకు దరఖాస్తులు చేసుకున్నా... అధినేత మాత్రం గెలుపు గుర్రాల వేటలో ఉన్నారంట. ఆర్థిక పరిపుష్టి, ప్రజాధరణ కలిగిన ధీటైన అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నారంట. బీజేపీ, కాంగ్రెస్‌లు మాత్రం ఎన్నికల యుద్ధానికి సిద్ధమన్నట్లు అభ్యర్థుల్ని ప్రకటిస్తూ సభలు పెడుతున్నాయి. బీఆర్ఎస్‌లో మాత్రం గెలిచే సామర్థ్యమున్న అభ్యర్థులెవరనే అన్వేషణ కొనసాగుతోంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో కూడా బీఆర్ఎస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆరు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక్కరే ఎమ్మెల్యే ఉన్నా మిగతా చోట్ల బలమైన ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం పార్టీ అధికారంలో లేనందున అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లన్నీ తిరిగి పడతాయనే గ్యారంటీ ఏమీ ఉండదు. కానీ..! బలమైన అభ్యర్థి పోటీ చేయడం ద్వారా గెల్వడం కష్టమేమీ కాదని ఆ పార్టీ అభిప్రాయ పడుతోంది. మెదక్ పార్లమెంట్ స్థానం గులాబీ బాస్ కేసీఆర్ సొంత ఇలాక కావడమే కాకుండా హరీశ్‌రావుతో పాటు మరో నలుగురు బలమైన ఎమ్మెల్యేలున్నారు. వీరంతా గంపగుత్తగా కష్టపడి మెదక్ ఎంపీ సీటు గెల్చి తీరుతమనే ధీమాలో ఉన్నారు. అయితే అభ్యర్థి ఎవరనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. జహీరాబాద్ పరిధిలో ఒకే ఒక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం ఉంది. అక్కడి నుంచి 2 సార్లు ఎంపీగా గెల్చిన పారిశ్రామిక వేత్త బీబీ పాటిల్ పార్టీ మారడంతో బీఆర్ఎస్‌కు కొత్త అభ్యర్థి కావాల్సి వచ్చిం ది. ఇక్కడ ఎమ్మెల్యేలు లేకపోవడమే కాకుండా ధీటైన అభ్య ర్థి లేకపోవడంకూడా ఆపార్టీకి తలనొప్పిగా మారిందంటున్నారు.

గెలిచే సమర్థుల కోసం వేట..

మెదక్ ఎంపీగా ఎవరు పోటీ చేసినా గెల్వొచ్చు అనేది బీఆర్ఎస్ నాయకుల అభిప్రాయంగా ఉంది. అందుకే అనేక మంది ఎంపీ టికెట్ కోసం తెగ తిరుగుతున్నారు. ఇప్పటికే డజన్ మంది వరకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరుతూ కేసీఆర్, ఇతర నాయకుల్ని కలుస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారులు, మాజీ ఎమ్మెల్యేలున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు రాని వారిని బుజ్జగించడం కోసం ఎంపీ టికెట్ ఆఫర్ పెట్టిన వాళ్లు సైతం ఆశపడుతున్నారు.బీరయ్య యాదవ్, ఆర్ సత్యనారాయణ ఇద్దరు కూడా కేసీఆర్‌ను కలిసి ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు. బీరయ్య యాదవ్ ఏడు నియో జకవర్గాల్లో పర్యటిస్తున్నారు. యాదవులు, బీసీలు, వివిద వర్గాల మద్దతు కూడగడుతున్నారు. సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్ టికెట్ అడుగుతున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో హామీ పొందిన వారిలో మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, గాలి అనిల్‌కుమార్, వంటేరు ప్రతా పరెడ్డి ఉన్నారు. ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. అయితే వీరంతా కూడా కేసీఆర్ దృష్టిలో గెలుపు గుర్రాలు కారనే అభిప్రాయముందంటున్నారు. అందుకే ఆర్థిక వనరులుండీ ప్రజల్లో పలుకుబడి కల్గి బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను ఢీకొట్టి గెల్వగలిగే సామర్థ్యమున్న అభ్యర్థులను రంగంలో దించే యోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. అవసరమైతే కేసీఆర్ లేదంటే ఆ కుటుంబానికి చెందిన వ్యక్తుల్లో ఒకరు రంగంలోకి దిగే అవకాశం లేకపోలేదంటున్నారు. ఇక జహీరాబాద్ పరిస్థితి భిన్నంగా ఉంది. సిట్టింగ్ ఎంపీ పార్టీ మారడంతో క్యాడర్ కొంత చేజారిపోతుంది. ఆరు చోట్ల ఎమ్మెల్యేలు ఓడిపోయి ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గెలుపు అంత సులువేమీ కాదు. కానీ..! బలమైన అభ్యర్థిని పోటీ చేయించకపోతే పార్టీ మరింత బలహీన పడే ప్రమాదముందనేది ఆ పార్టీ నేతలు చెబు తున్న మాట. ఇక్కడి నుంచి కూడా టికెట్ కోసం అభ్యర్థనలు మొదలయ్యాయి. తెలంగాణ ఉద్యమకారులు బిక్షపతి ఎంపీ టికెట్ ఇవ్వాల్సిందిగా అధినేతను కలిసి విజ్ఞప్తి చేశారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలని ఆయన అనుచరులు కోరుతున్నారు.

కాంగ్రెస్, బీజేపీ ముందడుగు..

జహీరాబాద్ బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్ ఖరార య్యారు. బీజేపీలో చేరిన వెంటనే ఎంపీ టికెట్ ఇచ్చారు. పటాన్‌చెరులో మోడీ విజయ సంకల్ప యాత్ర సభ జరిపారు. ఆ సభకు జహీరాబాద్ ప్రాంతం నుంచి జనసమీకరణ చేశారు. కాంగ్రెస్ కూడా మాజీ ఎంపీ సురేష్ షెట్కర్ పేరును ప్రకటించనుంది. బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనేది ఇంకా తేలలేదు. మెదక్ నుంచి కాంగ్రెస్ బీసీ అభ్యర్థిని బరిలో దించాలని చూస్తుంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధుకు ఎంపీ టికెట్ కోరుతున్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి 40 వేల ఓట్లు పొందిన మధు పేరును బీసీ కోటాలో పరిశీలిస్తున్నారు. బీజేపీ సైతం రఘునందన్‌రావు పేరు పరిశీలిస్తుంది. పోటీ ఉన్నప్పటికీ ఆయనకే టికెట్ రావచ్చు అంటున్నారు.

ఎంపీ అభ్యర్థిత్వానికి అసదుద్దీన్ ఓవైసీ మద్దతు కోరిన బీరయ్య యాదవ్



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎంపీ అభ్యర్థితం కోసం ఎంఐఎం అధినేత, పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీని ఎంపీ అభ్యర్థిత్వానికి మద్దతు కోరిన తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్య యాదవ్. గత 30 ఏండ్లుగా అన్ని బడుగు బలహీన వర్గాల, బీసీల, మైనార్టీ సంక్షేమం కోసం ముఖ్యంగా సెక్యూలర్ నేతగా ముస్లింల అభివృద్ధి కోసం వేసిన సచార్ కమిటీ అమలు కోసం, సీఏఏ ఎన్ ఆర్‌సీ రద్దుకోసం పోరాటం చేసిన తనకు మద్దత్తు ఇవ్వాలని ఓవైసీని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఓవైసీ సానుకూలంగా స్పందించి మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారన్నారు. ఆయనతో బీఆర్ఎస్ మైనార్టీ, నాయకుడు ఉస్మాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నేతల అక్రమ అరెస్టు ఖండన



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు సీపీఐ(ఎం)నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు ఖండించారు. తనతో పాటు పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.మాణిక్యం, నాయకులు యాదగిరి, పటాన్ చెరు నాయకులు వాజిద్ అలీ, నాగేశ్వరరావులను అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడాన్ని తప్పుబట్టారు. నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు.

టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడుగా గంగా జోగినాథ్



నవతెలంగాణ-జోగిపేట

ఉమ్మడి మెదక్ జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడుగా అందోల్ నియోజకవర్గానికి చెందిన మాజీ మార్కెట్ చైర్మెన్ గంగా జోగినాథ్ గుప్తా నియామకమ య్యారు. అందోలు నియోజకవర్గం పెద్దపూర్ గ్రామానికి చెందిన గంగా జోగినాథ్ గుప్తా.. జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడుగా సేవలు అందించారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీ.బీ పాటిల్ సిఫారసు ఈమేరకు టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడుగా గంగా జోగినాథ్ గుప్తాను నియమిస్తూ భారత్ సంచార్ నిగమ్ కేంద్ర సీఎండీ ఊర్వశి సంగ్వార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం జోగిపేటలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తనను ఈ పదవిలో నియమించడం పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీ. బీ. పాటిల్‌లకు కృతతలు తెలిపారు.

అంగనాడీల్లో బయోమెట్రిక్ ఆలోచనను విరమించుకోవాలి



నవతెలంగాణ-సదాశివపేట

అంగన్వాడీ సెంటర్లలో బయోమెట్రిక్, సీసీ కెమెరాలు పెట్టే ఆలోచన ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని.. సమ్మె కాలపు జీతం తక్షణమే ఇవ్వాలని, అంగన్వాడి హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలన్నారు. అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా వారికి వేతనాలు పెంచకుండా, ఈఎస్ఐ, పిఎఫ్ చట్టపరమైన సౌకర్యాలు కల్పించకుండా.. అంగన్వాడి సెంటర్లలో సీసీ కెమెరాలు పెట్టాలనే ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే అంగన్వాడి సిబ్బంది అనేక రకాల పనులు చేస్తున్నారన్నారు. అయినప్పటికీ వారికి పనికి తగ్గ వేతనం రావట్లేదన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకుపోవడంలో అంగన్వాడీ సిబ్బంది ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. కాబట్టి బయోమెట్రిక్ విధానం కాకుండా.. ముందుగా వారికి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్వాడి ఉద్యోగులకు నెలకు రూ.18 వేలు ఇస్తామని చెప్పిందని.. దాని తక్షణమే అమలు చేయాలన్నారు. వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు.

ప్రయివేటు పాఠశాలల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-రామచంద్రాపురం

ప్రయివేటు పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ ప్రయివేటు స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు విలియం జేమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్, జనరల్ సెక్రెటరీ రమేష్, కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి మరియు ట్రస్మ రాష్ట్ర ఈసీ మెంబర్ పీటర్ జైపాల్‌ని ట్రస్మా జిల్లా అధ్యక్షులు జనార్దన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ మాట్లాడుతూ.. ప్రయివేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రయివేటు విద్యాసంస్థల చైర్మెన్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

పోగొట్టుకున్న మొబైల్ ఫోను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి బాధితుడికి అప్పగించడం జరిగిందని ఎస్ఐ అపూర్వ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చిన్న గుండవెల్లి గ్రామానికి చెందిన కమలాకర్ రెడ్డి తన ఫోన్‌ను పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను నమోదు చేసి, బ్లాక్ చేయడం జరిగిందన్నారు. ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం రాగానే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి ఫోన్‌ను అందజేయడం జరిగిందన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా , గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనంగా ఎత్తుకొని పోయినా వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్)లో పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చన్నారు. తద్వారా కోల్పోయిన ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-కొండపాక

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు వాసరి లింగారావు అన్నారు. మండలంలోని దమ్మక పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పిట్టల వాడ గ్రామంలో తాగునీటి కొరత తీర్చడం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన బోరును మంగళవారం వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిట్టల వాడలో తాగునీటి కొరత ఉందని ప్రజాదర్బార్ లో దరఖాస్తు చేసుకున్న వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన..

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని నర్సింహుల పల్లి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు ప్రత్యే కాధికారిణి నాగారాణీ, ఎంపీటీసీ కొలిపాక రాజు, మండల కాంగ్రెస్ నాయకు లతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు పీఆర్ ఏఈ ప్రోటోకాల్ పాటించకుండా ప్రజాప్రతినిధులను అగౌరపరిచేలా ఏకపక్షంగా వ్యవ హరిస్తున్న తీరుపై ఎంపీటీసీ కొలిపాక రాజు అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్దంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అధికారులు.. అధికారంలో ఉన్న ప్రతీ ప్రభుత్వానికి వత్తాసు పలకడం సమంజసం కాదని ప్రభుత్వాధికారుల్లో మార్పు రావాలని లేనిపక్షంలో పై అధికారులకు పిర్యాదు చేస్తామని రాజు హెచ్చరించారు.

చెరకు రైతులకు పూర్తి బకాయి చెల్లింపు

- ఇటీవలే రూ.5కోట్లు.. సోమవారం మరో రూ.1.70కోట్లు రైతుల ఖాతాల్లోకి
- మాట నిలుపుకున్న ట్రైడెంట్ నూతన డైరెక్టర్ ఖిజర్ యాఫై



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని ట్రైడెంట్ చెరకు రైతులకు పరిశ్రమ యాజమాన్యం బకాయి డబ్బులను వంద శాతం చెల్లించింది. ఇటీవలే కలెక్టర్ సమక్షంలో రూ.5కోట్లు చెల్లించగా.. తాజాగా సోమవారం మరో రూ.1.70కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా నూతన డైరెక్టర్‌గా ఖిజర్ యాఫై బాధ్యతలు స్వీకరించినప్పుడు.. రైతులకు పూర్తి బకాయి డబ్బులు చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాటాడుతూ.. డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే నాటికి గత యజమాన్యం రూ.16.83 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా.. నేటికీ రూ.16.81 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. కాగా సోమవారం రైతులకు చెల్లించిన కోటి 70 లక్షలతో రైతులకు చెల్లించాల్సిన బకాయిలు 100శాతం పూర్తయ్యాయన్నారు. కేవలం 9 మంది రైతులకు సంబంధించి ఖాతా నెంబర్ సరిగా లేకపోవడంతో రూ.1 లక్ష 83 వేలు మాత్రం జమ కాలేదని.. సదరు రైతులు నూతన ఖాతా నెంబర్లతో తమను సంప్రదిస్తే ఖాతాను అప్డేట్ చేసి 9 మంది ఖాతాలో జమ చేస్తామన్నారు. మొత్తం 7.38 కోట్ల బకాయిల్లో గత ఐదు రోజుల క్రితం రూ.5 కోట్లు చెల్లించామని, సోమవారం మధ్యాహ్నం రూ.1 కోటి 70 లక్షలను జమ చేసినట్టు చెప్పారు. ఇప్పటివరకు తమకు సహకరించిన రైతులకు రైతు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. డబ్బులు జమకాని రైతుల కోసం 9 మంది రైతులు తమకు జమకని బకాయిల కోసం పరిశ్రమ వద్ద తమ సిబ్బంది నర్సింలు సెల్ నెంబర్ 9908091734కు రైతు స్లిప్‌కాపీ, పట్టాదార్ పాస్‌బుక్కు జిరాక్స్, ప్రస్తుతం చెలామణిలో ఉన్న ఖాతానెంబర్‌తో పరిశ్రమలో సంప్రదిం చాలని విజ్ఞప్తి చేశారు. ఇకముందు కూడా పరిశ్రమలో క్రషింగ్ కొనసాగించేందుకు అందరూ సహకరిస్తే ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. తాను జహీరాబాద్ వాసినని.. చెరుకు పండించే కుటుంబం నుండి వచ్చిన వాడిని కనుక చెరుకు రైతుల బాధలు తనకు తెల్సన్నారు. పాత యజమాన్యం సహకరిస్తే నెల రెండు నెలల్లో పరిశ్రమలో రిపేరింగ్ కార్యక్రమాలను పూర్తి చేసి పున: ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం త్వరలోనే నిపుణుల కమిటీని వేసి పరిశ్రమలో ఉన్న పనిముట్లు, యంత్రాలు ఏ స్థాయిలో పని చేయగలుగుతాయో ఒక నివేదికను తయారు చేస్తున్నామన్నారు. నిపుణుల నివేదిక ఆధారంగా త్వరలోనే మరమ్మత్తు కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు.

పీడీఎస్‌యూ సమావేశాల కరపత్రం విడుదల



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలను మార్చి 26, 27 తేదీలలో సంగారెడ్డిలో నిర్వహిస్తున్న సందర్భంగా.. టీపీటీఎఫ్ ఆఫీస్‌లో మంగళవారం కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్ మాట్లాడుతూ.. త్యాగాల పునాదుల మీద కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నేడు ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం ప్రధానంగా విద్యారంగాన్ని కోలుకోలేకుండా విధ్వంసం చేసిందన్నారు. యూనివర్సిటీలను పూర్తిస్థాయిలో నిర్లక్ష్యానికి గురిచేసిందన్నారు. వర్సిటీలకు వీసీలను కూడా నియమించలేదన్నారు. అధికారం కొత్తగా చేపట్టిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నెన్నో వాగ్దానాలు చేసిందన్నారు. విద్యారంగాన్ని ఆదుకుంటామని ప్రకటించిందని.. తొలి బడ్జెట్‌లో 20శాతం నిధుల్ని కేటాయించాల్సిన చోట 7.8శాతం మాత్రమే కేటాయించిందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా నూతన ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తూ భవిష్యత్తు ఉద్యమ కార్యచరణను పీడీఎస్‌యూ జనరల్ కౌన్సిల్ ప్రకటించబోతోందన్నారు. ఈ కౌన్సిల్‌కు రాష్ట్ర నలుమూలల నుండి వందలాది విద్యార్థి ప్రతినిధులు, ఇతర రాష్ట్రాల సౌహార్ధ ప్రతినిధులు హాజరవుతారున్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు టి.సందీప్ జిల్లా నాయకురాలు శ్రీనిధి, ఎం ప్రవీణ్, శ్రీధర్, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘణపురానికి సింగూరు నీటి విడుదల

నవతెలంగాణ-పుల్కల్

గణపురం ఆయకట్ట కింద రైతులు సాగుచేసిన పంట పొలాల కోసం మంగళవారం సింగూరు నుంచి నీటిని వదిలారు. సింగూరు ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న విద్యుత్ ఉపకేంద్రం ద్వారా 1460 క్యూసెక్కుల నీటిని దిగివకు వదిలినట్టు సంబంధిత అధికారులు చెప్పారు. ఈ నీటిని వృథా చేయకుండా ఘణపురం ఆయకట్ట రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో మంజీరా పరివాహక ప్రాంతాల ప్రజలు, పశు కాపరులు, గొర్ర కాపరులు, మత్స్యకారులు, మంజీరా నది వైపు వెళ్లొద్దని ప్రాజెక్టు అధికారులు సూచించారు.



మానసిక ఆరోగ్యం అవశ్యం



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రతి ఒక్కరికీ మానసిక ఆరోగ్యం అవశ్యమని, దాని గురించి నిరంతరం చర్చించాలని వైభవి, న్యాయవాది సృష్టీకరించారు. హైదరా బాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్టూడెంట్ లెఫ్ట్ ఆధ్వర్యంలో 'బ్రేవ్ టుగెదర్' (ధైర్యంగా కలిసి ఉండడం) అనే అంశంపై మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మేబెలెన్-న్యూయార్క్, 'యువా'ల సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానవక్తగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్య అవగాహన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. మానసిక ఆరోగ్యంపై నిరంతరం చర్చించాల్సిన ఆవశ్యకతను వైభవి ప్రస్తావిస్తూ, కళాశాల విద్యార్థులలో గణనీయమైన శాతం ఒత్తిడి, నిరాశ, ఆందోళన, ఆత్మహత్య ఆలోచనలను ఎదుర్కొంటున్నట్టు గణాంకాలతో సహా వివరించారు. బ్రేవ్ విధానాన్ని ఆమె పరిచయం చేస్తూ, వర్తమానంలో ఉండడం, సరైన అమరికను సృష్టించడం, ప్రశ్నలు అడగడం, భావాలను ధృవీకరించడం, చర్యను ప్రోత్సహించడం వంటి దశలను పరిచయం చేశారు. స్వీయ సంరక్షణ కోసం ప్రతిరోజూ పది నిమిషాలు మనకోసం ఏదైనా చేయడానికి కేటాయించడం, చికిత్సను ఒక ఎంపికగా అన్వేషించడం, సవాళ్లకు చురుకుగా పరిష్కారాలను వెతకడం వంటి ఆచరణాత్మక చిట్కాలను వైభవి అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి మానసిక శ్రేయస్సును మెరుగుపరచడానికి అవసరమైన పుడు మద్దతు కోరేందుకు తురుకైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.మానసిక ఆరోగ్య అవగాహనను ప్రోత్సహించడానికి, వ్యక్తుల మానసిక ఆరోగ్య ప్రయాణానికి మార్గదర్శనం చేయడానికి విలువైన సూచనలను చేశారు.

జిల్లా ప్రజలను నిరాశపరిచిన ప్రధాని మోడీ

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాకు ఒక్కటైనా కొత్త ప్రాజెక్టు ఇవ్వలేదని.. మోడీ పర్యటన జిల్లా ప్రజలకు నిరాశజనకంగా మిగిలిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వంలో అకోలా- నారాయణఖేడ్ మీదుగా బీదర్‌కు రైల్వేలైన్ వేస్తామని చెప్పినా.. దానికి నేటికీ అతిగతి లేదన్నారు. నిజాంపేట్-బీదర్ జాతీయ రహదారికి నిధులు కేటాయించినా.. పనులు ప్రారంభంకాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉన్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఎటువంటి హామీ లేదని విమర్శించారు. వలసల నివారణకు చర్యలు లేవు అని దుయ్యబట్టారు. పేరుకే నిమ్జ్ ప్రాజెక్ట్ అని.. అందులో భూములు కోల్పోతున్న రైతులకు భరోసా లేదన్నారు. ఎన్నేండ్లైనా యువతకు ఉపాధి రాలేదని విమర్శించారు. నారాయణఖేడ్, ఆందోల్ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటుకు స్పష్టమైన హామీ లేదన్నారు. సంగారెడ్డి జిల్లాకు కనీసం రైల్వేలైన్ ఊసే లేదన్నారు. దేశ ప్రధాని వస్తున్నారని.. కాబట్టి సంగారెడ్డి జిల్లాకు ఏదైనా పెద్ద ప్రాజెక్టు వస్తుందేమో అని ఎంతో ఆశతో ఎదురు చూసిన జిల్లా మోడీ పర్యటన నిరాశే మిగిల్చిందన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధి పట్టని బీజేపీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.


పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు అందజేత



నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని కోనాపూర్, ఆరూరు, తంగడపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మన సమాజం ఫౌండేషన్ ద్వారా పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మహేష్ స్వామి మాట్లా డుతూ.. విద్యార్థి జీవితంలో 10వ తరగతి మొదటి మెట్టు అన్ని.. కాబట్టి కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సంపాదించుకోవాలన్నారు. సమాజానికి మనం ఏదైనా చేయాలనే సంకల్పంతో.. ఉడతా భక్తిగా సమాజ సేవే లక్ష్యంగా మన సమాజం ఫౌండేషన్ ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ఫౌండేషన్ సభ్యులందరి సహాయ సహకారాలతో మనుమందు కూడా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మన సమాజం ఫౌండేషన్ సహాయ కార్యదర్శి రవికుమార్ గౌడ్, మన సమాజం ఫౌండేషన్ నిర్వాహకులు విజయ్ స్వామి, వినోద్ కుమార్, మడి వాలయ స్వామి, మధుకర్ యాదవ్, కోనాపూర్, ఆరూరు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపాల్టీలో ప్లాస్టిక్ వాడకం చట్ట విరుద్ధంగా జరుగుతుందని.. వాటిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, ప్రజల యొక్క ఆరోగ్యం పాడవు తుందని, ప్లాస్టిక్ వాడకం నిషేధించారన్నారు. నారాయణఖేడ్ మున్సిపాల్టీలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందని.. ఎవరైనా ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విజిట్ బృందాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి విజిట్‌లో ఐదు వేల రూపాయలు, రెండో విజిట్ లో రూ.25000, మూడో విసిట్లో దుకాణం సీజ్ చేస్తామన్నారు. అలాగే పట్టణంలో హొటలలో పరిశుభ్రత పాటించడం లేదని.. వాటిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల ముందు, చుట్టుపక్కల చెత్త చెదారం ఉండకూడదని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

భేల్‌లో భద్రతా ప్రతిజ్ఞ

నవతెలంగాణ-రామచంద్రాపురం



మహారత్న కంపెనీలలో ఒకటైన రామచంద్రాపురంలోని భేల్ పరిశ్రమలో జాతీయ భద్రతా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెబి రాజా అందరితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. భేల్ భద్రతా పక్షం సందర్భంగా ఈడి మాట్లాడుతూ.. భేల్ పరిశ్రమలో పనిచేసే వారి కోసం భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వహించకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. సంస్థలో పనిచేసే వారు మంచిగా ఉంటే వారి కుటుంబం కూడా సుఖసంతోషాలతో ఉండగలుగుతుందన్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు అందరి చేత కెబి రాజా భద్రత ప్రతిజ్ఞను ఈ సందర్భంగా చేయించారు.

ఎమ్మెల్యేకు మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

నవతెలంగాణ-జహీరాబాద్



మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే మాణిక్యరావుకు ఆహ్వాన పత్రికను అందించినట్టు కేతకీ సంగమేశ్వర దేవస్థానం ఈవో తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావును మంగళవారం కలసి ఝరాసంఘం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని 05-03-2024 మంగళవారం నుంచి 13-04-2024 బుధవారం వరకు నిర్వహించబోయే నవాహ్నిక జాతర బ్రహ్మోత్సవాలు ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్, స్పెషల్ ఆఫీసర్ రంగా రావులు ఉన్నారు.

మాదారం క్రషర్లను తనిఖీ చేసిన మైన్స్ అధికారులు

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని మాదారం శివారులో గల కంకర క్రషర్లను సెంట్రల్ మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, రవీంద్రనాథ్ బృందం మంగళవారం ప్రత్యేకంగా తనిఖీ చేశారు. మాదారం గ్రామ పరిధిలోని గల కంకర క్రషర్లు, క్వారీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గతనెల 9న స్థానిక యువజన సంఘం ఆధ్వర్యంలో సాయం వల్ల విజయ్ గౌడ్, సుదర్శన్‌లతో కూడిన గ్రామస్తుల బృందం సెంట్రల్ మైన్స్‌అండ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో అధికారులు స్థానికంగా గల రాక్ సాండ్, పీపీఆర్ ఎం.శ్రీమన్నారాయణ కంకర క్రషర్లలోతనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ పత్రాలను పరిశీలించారు. కంకర క్రషర్ల పరిశీలనకు వచ్చిన ప్రాంతానికి స్థానిక యువజన నాయకులు చేరుకున్నారు. విజయ్ గౌడ్, సుదర్శన్లు అధికారులకు స్థానిక క్రషర్ల వల్ల జరుగుతున్న గ్రామస్తుల ఇబ్బందులు తదితరాలను వివరించారు. ఈ సందర్భంగా విజయ్ గౌడ్, సుదర్శన బృందం మాట్లాడుతూ తమ ఫిర్యాదుల మేరకు అధికారులు, తనిఖీ విచారణ కార్యక్రమం నిర్వహించారన్నారు. తనిఖీ విచారణకు సంబ ంధిం చిన పూర్తి విషయాలను అధికారులు తమకు అందజేస్తామని చెప్పారని విజయ్ గౌడ్ బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు టీఎస్ జాక్ అధ్యక్షుడు విజ య్ గౌడ్, సుదర్శన్,రమణ, గణేష్, కే.వెంకటేశంగౌడ్, చంద్రశేఖర్, సంతు, వినయ్, పాండు, వీరేశం, నరేష్, కంకర క్రషర్స్ క్వారీల యజమానులు పాల్గొన్నారు.

డిగ్రీ లెక్చరర్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-జోగిపేట

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న పి.సుప్రియకు ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ పట్టా వరించింది. 'ఎఫెక్ట్ ఆఫ్ యోగి ప్రాక్టీసెస్ ఆన్ ఫిజికల్ ఫిజిలాజికల్ అండ్ సైకలాజికల్ వేరియబుల్స్ అమౌంట్ సెంట్రల్ తెలంగాణ గర్ల్స్' అనే అంశం పైన ప్రొఫెసర్ కే.దీప్లా మార్గదర్శకత్వంలో సమ ర్పించిన పరిశోధన గ్రంథానికి గాను ఆమెకు డాక్టరేట్ పట్టాను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి. రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది డాక్టర్ సుప్రియ కు అభినందనలు తెలిపారు.

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ జాతీయ అధ్యక్షులు జె.పి. నడ్డా, తెలంగాణ రాష్ట్ర మహిళా కమీషన్ చైర్మెన్ సునీత లక్ష్మారెడ్డికి ఏఐసీసీ జాతీయ కాంగ్రెస్ మీడియా సభ్యులు డా.గిరిజా షెట్కార్ లేఖ పంపించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై, ఆయన తల్లిపై అనుచితి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. కాబట్టి ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



నవతెలంగాణ-మునిపల్లి

మండల పరిధిలోని మల్లికార్జున్‌పల్లి గ్రామానికి చెందిన నారాయణ(51) జనవరి 03న మృతి చెందాడు. కాగా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకంలో భాగంగా ఆయనకు బుదేరా ఎస్‌బిఐ బ్యాంకులో ఖాతా ఉంది. దాంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇన్సూరెన్స్ చెక్కును ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సురేష్ మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ.. మల్లికార్జున్‌పల్లి గ్రామానికి చెందిన నారాయణ ఎస్‌బిఐ బ్యాంక్ ఖాతా కలిగి ఇటీవలే మృతి చెందాడన్నారు. నామిని అయిన జగ్దమ్మకు ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును అందించినట్లు తెలిపారు. ప్రతి ఖాతాదారుడు ఏడాదికి రూ.436 చెల్లిస్తే నార్మల్ డెత్ అయితే రూ.2లక్షలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. అలాగే బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకం ద్వారా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం ప్రధానమంత్రి యోజన పథకంతో తమ లాంటి నిరుపేదలకు చేయూత నందిస్తుందని బాధితురాలు జగ్దమ్మ తెలిపారు. అలాగే బ్యాంకు మేనేజర్ సురేష్‌తోపాటు సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

పెద్దగోపులారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మునిపల్లి



తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పెద్దగోపులారం గ్రామంలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులను ఎంపీటీసీ బుర్కల పాండు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో గ్రామాలభివృద్ధి జరగలేదన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పలు అభివృద్ధి పనులు చకచగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాచయ్య, కిష్టయ్య, మాజీ ఉప సర్పంచ్ బుడ్డ నర్సింలు, గ్రామ పెద్దలు శ్రీశైలం, బాలయ్య యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు నరేందర్, బుడ్డ మల్లేష్, నీలం శ్రీనివాస్, మహేందర్, అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కుసుమ సాగుతో అధిక లాభాలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

కుసుమ పంట సాగుతో అధిక లాభాలు పొందవచ్చు అని జహీరాబాద్ ఏడీఏ బిక్షపతి అన్నారు. మండలంలోని రేజింతల్ గ్రామంలో రైతు సాగుచేస్తున్న కుసుమ పంటను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతు పొలం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవీకే డీడీఎస్ జహీరాబాద్ ఆధ్వర్యంలో రేజింతల్ గ్రామంలో కుసుమ పంట సాగు రైతులు ప్రోత్సహించాలన్నారు. కుసుమ పంటలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. రైతులు కుసుమ పంటను సాగు చేసుకోవా లన్నారు. ఈ సమావేశంలో కేవీకే డీడీఎస్ అధికారులు వరప్రసాద్, రమేష్, శైలజ, ఏఈఓ సన్నీత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జీరో బిల్లుపై సమస్యలొస్తే ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించండి

నవతెలంగాణ-న్యాల్‌కల్



గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు అర్హులైన వారికి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందజేస్తున్న విషయం విధితమే. కాగా గృహజ్యోతికి అర్హులైనప్పటికీ.. జీరో బిల్లు రాని యెడల ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ సురేష్ తెలిపారు. ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు, ప్రజా పాలన రసీదుతో దరఖాస్తు ఇవ్వాలన్నారు.

బదిలీ అయిన మండల విద్యాధికారికి సన్మానం



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మేళాసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల కొండాపూర్ మండలానికి బదిలీ అయిన మండల విద్యాధికారి దశరథ్‌ను స్థానిక ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా దశరథ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యా యులు వీరన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి ఉపాధ్యాయులు గోపాల్, భుజంగం,శ్రీకాంత్, మంజువాణి, రత్నమ్మ, ప్రశాంతి, అనంతలక్ష్మి ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ట్యాబుల్లో ఫుల్.. ట్యాంకుల్లో నిల్

- మిషన్ భగీరథ అధికారుల తీరుపై సర్వసభ్య సమావేశంలో పలువురు అసహనం

నవతెలంగాణ-జిన్నారం





రాబోయే వేసవికాలం దృష్ట్యా మంచినీటి సరఫరాపై తగిన ఏర్పాట్లు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఓవైపు సూచిస్తూనే.. ట్యాబుల్లో ఫుల్... ట్యాంకుల్లో నిల్ అన్న చందంగా మిషన్ భగీరథ అధికారుల పనితీరు ఉందంటూ జిన్నారం మండల సర్వసభ్య సమావేశం అసహనం వ్యక్తం చేసింది. జిన్నారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్ అధ్యక్షతన సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్ సమక్షంలో మండల సర్వ సభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సభలో మిషన్ భగీరథకు సంబంధించిన అంశాలను ఏఈ ధరణి మిగతా అధికారులతో కలిసి వివరిస్తుండగా.. జిన్నారం జెడ్పీటీసీ, సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్ మాట్లాడుతూ.. మీ పనితీరు ట్యాబుల్లో ఫుల్.. ట్యాంకుల్లో నిల్ అనే మాదిరిగా కాకుండా ప్రజా సౌకర్యవంతంగా ఉండాలని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీడీవో అరుణారెడ్డిలు స్పందిస్తూ.. గ్రామాల వారిగా సమన్వయంతో అధికారులు జాయింట్ సమావేశాలు నిర్వహిస్తే బాగుంటుందన్నారు. కాలుష్యం అంశంపై అసిస్టెంట్ ఇంజనీర్ అజయ్ మాట్లాడుతూ.. జిన్నారం మండల పరిధిలో వివిధ పారిశ్రామిక వాడల్లో పలు పరిశ్రమలకు నోటీసులు ఇచ్చామంటూ సభ దృష్టికి తీసుకురాగానే.. నోటీసులు సరే కాలుష్య సమస్య ఎన్నటికీ తీరేనంటూ గడ్డపోతారం ఎంపీటీసీ జానా బాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గడ్డపోతారంలో కాలుష్యం రోజు రోజుకు విచ్చలవిడిగా పెరిగిపోతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కంకర క్రషర్లకు, క్వారీలకు కూడా నోటీసులు సర్వ్ చేశామంటూ అధికారులు సభకు వివరించడంతో కొందరు సభ్యులు క్రషర్ల క్వారీల అంశాలపై మరిన్ని ప్రశ్నలు వేశారు. ఆర్అండ్‌బి అధికారులు రోడ్లు భవనాల విషయం సభలో వివరిస్తుండగా శివనగర్ టు కంజర్ల రోడ్డు పరిస్థితిని పట్టించుకోరా అంటూ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ ప్రశ్నించారు. పంచాయతీరాజ్ అంశాలను ఏ ఈ మల్లేశం సభలో వివరిస్తుండగా ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు సమాచారం లేకుండా, అంతకు ముందే వేసిన సిసి రోడ్లపై మళ్లీ సిసి రోడ్లకు పనులు చేపట్టడం ఏమిటంటే కాజిపల్లి ఎంపిటిసి ఆకుల భార్గవ్ మండిపడ్డారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు సమాచారాన్ని ముందస్తుగా ఏదో మొక్కుబడిగా ఇస్తున్నారే తప్ప గ్రామ అవసరాలు ఏంటి ఎక్కడెక్కడ పనులు కేటాయిద్దాం అన్న చర్చలు ప్రజలతో సంప్రదింపులే పూర్తిగా విస్మరించాలంటూ పంచాయతీరాజ్ ఏఈ మల్లేశం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో వైద్య ఆరోగ్య అంశం చర్చకు రాగానే జిన్నారంలో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమానికి జెడ్పీటీసీకి సమాచారం ఇవ్వరా అని సభలో కాజిపల్లి ఎంపిటిసి భార్గవ్ అభ్యంతరం వ్యక్తం చేయగా జడ్పీ వైస్ చైర్మెన్ ప్రభాకర్ ఆ విషయం ఎందుకులే అంటూ సున్నితంగా వారించారు. ఇలా పలు సమస్యలు, సమాధానాలతో సమావేశం వాడీవేడీగా సాగింది. కాగా వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షులు గంగు రమేష్ ఎంపీ డీవో అరుణరెడ్డి, జిన్నారం మండల డిప్యూటీ తాసిల్దార్ మల్లి కార్జున స్వామి, ఎంపీటీసీలు జానాబాయి, కోరబోయిన లావ ణ్య ఆకుల భార్గవ్, ఎలిమెల స్వాతి, బత్తుల సంతోషి, గంగు రమేష్, ఏఈలు రాజు, మల్లేశం అజయ్, ధరణి, సెక్రటరీలు కాజిపల్లి శ్రీనివాస్ రెడ్డి, గడ్డపోతారం వెంకట్, జిన్నారం లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుల్కల్లో పారిశుధ్య లోపం

- పట్టించుకోని ప్రత్యేక అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నవతెలంగాణ-పుల్కల్

మండల కేంద్రమైన పుల్కల్లో ఎక్కడ చూసినా మురికి కాలువలు నిండి చెరువులను తలపిస్తున్నాయి. దాంతో మురికి నీరు ఇండ్లలోకి వచ్చి దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రామ సర్పంచ్ ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టేవారు. అయితే వారి పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రత్యేక అధికారులు సరిగ్గా పట్టించుకోకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వారు ఎప్పుడు గ్రామానికి వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియని దుస్థితి నెలకొన్నదని మండిపడుతు న్నారు. దాంతో మౌలిక వసతుల కల్పన కూడా సరిగ్గా జరగడం లేదన్నారు. పారిశుధ్యం పూర్తి నిర్లక్ష్యం చేయడంతో దోమలు పెరిగి అనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇన్‌చార్జి అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని కోరారు. లేనియెడల గ్రామస్తులంతా ఏకమై ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరిస్తున్నారు.

టీచర్లు రియల్ ఎస్టేట్ చేస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హెచ్చరించారు. నారాయణఖేడ్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా విద్యాధికారి, వివిధ మండలాల విద్యాధికారులతో నియోజకవర్గ విద్యా వ్యవస్థపై సమీక్ష మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే, డీఈఓ వెంకటేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా పాఠశాలల్లో మౌలిక వసతులు అవసరం ఉన్నాయో అక్కడ మౌలిక వసతులు కల్పిస్తామని, విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి అధిక మార్కులు సాధించే విదంగా తీర్చిది ద్దాలన్నారు. అలాగే సమయ పాలన పాటించని ఉపాధ్యాయులపై, పాఠశాలలకు డుమ్మా కొట్టి రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో స్వీపర్లు లేకపోవడంతో శానిటేషన్‌కు ఇబ్బంది అవుతున్నదని శాసనసభ్యుల దృష్టికి రాగా.. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే ప్రతీ మండలానికి రెగ్యులర్ ఎంఈఓలు ఉండేవిధంగా, 317జీ.ఓ పై ప్రభుత్వం కమిటీ వేసిందని, ఇందులో ఎవరైనా భార్యాభర్తలు ఉంటే స్పౌస్ కోటలో బదిలీ గురించి విద్యాశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనయులు, కాంగ్రెస్ నాయకులు రమేష్ చౌహన్, ఎంఇఓ లు శంకర్, విశ్వనాథ్, శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రవీందర్, మాజీ ఎంపిటిసి పండరి రెడ్డి, నాయకులు లోకేష్ రెడ్డి, నారాయణ జాదవ్ ఇతరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో గ్రామాలభివృద్ధి చేయాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



అధికారులు సమన్వయంతో పని చేసి.. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపంచాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఎంపీపీ కర్ర చాందీబాయి చౌహన్ అధ్యక్షతన మంగళవారం జరిగిన నారాయణఖేడ్ మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని.. శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసినందున స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు ఎల్లపుడు గ్రామాల్లో అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. రానున్న ఎండాకాలంలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. అధికారులు అందరూ సమ న్వయంతో పనిచేసి సంక్షేమ పథకాలను అమలు చేసి, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో మంజూరైన సీసీ రోడ్లను తొందరగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్ర చాందీబాయి చౌహన్, వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, ఎంపీపీ తనయులు రమేష్ చౌహన్, మండల స్థాయి అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీ టీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

నవతెలంగాణ-సంగారెడ్డి



ఎల్ఆర్ఎస్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహి స్తున్నట్టు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి రూ.20 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటున్నదన్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ వద్దు, భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందని మండిపడ్డారు. అప్పుడు అడ్డగోలుగా మాట్లాడిన ఇప్పటి కాంగ్రెస్ మంత్రులు, ఇప్పుడు నోరు ఎందుకు విప్పడం లేదు అని ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్ అంటే ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడమే అన్న కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు ప్రజల నుంచి ఎందుకు డబ్బులు దోపిడీ చేస్తున్నారో చెప్పాలన్నారు. అప్పుడు ఎల్ఆర్ఎస్ వద్దు అంటూ మాట్లాడిన రేవంత్, భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. నేడు జరగబోయే ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ నీటిని విడుదల చేయాలి

నవతెలంగాణ-కల్హేర్



నల్లవాగు ప్రాజెక్టు నుంచి కుడి కాలువ ద్వారా వెంటనే నీటిని విడుదల చేయాలని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో డీఆర్వోకి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాటాడుతూ.. సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టులో నీటి ద్వారా ఆధారపడి ప్రాజెక్టు ఆయకట్టు కింద బిబిపేట్, ఖానాపూర్, కృష్ణాపూర్, కల్హేర్ గ్రామాల రైతులు ప్రతి సంవత్సరం లాగే యాసంగిలో పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఈ సంవత్సరం కూడా ప్రాజెక్టు నుంచి నీటిని నీటిని విడుదల చేస్తారేమో అనే ఆశతో వరి, జొన్న పంటలను సాగు చేశారన్నారు. కానీ ఈసారి ప్రాజెక్టులో సరిపడా నీళ్లు ఉన్నా.. నీటిని వదలక పోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పుల తెచ్చి పెట్టుబడి పెడితే.. కండ్ల ముందే పంట ఎండిపోయే దుస్థితి వచ్చిందని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారన్నారు. కాబట్టి వెంటనే సంబంధిత అధికారులు స్పందించి.. నీటిని విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ నరేందర్ రెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, కిషన్ రెడ్డి, పంతులు, ఆయకట్టు రైతులు, నాయకులు తదితరులు ఉన్నారు.

హుగ్గెల్లి మాజీ సర్పంచ్ తండ్రి మృతి

నవతెలంగాణ-జహీరాబాద్



హుగ్గెల్లి గ్రామ మాజీ సర్పంచ్ కిషన్ రాథోడ్ తండ్రి హీరూ రాథోడ్(70) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కాగా అంత్యక్రియలను బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కిషన్ రాథోడ్ తండ్రి మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే కాంగ్రెస్ పార్టీ, కార్మిక నాయకులు రాములు యాదవ్ ఆయన అనుచరులతో వెళ్లి పరామర్శించారు.

నేటి సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-పుల్కల్



రాబోయే ఎన్నికల దృష్ట్యా.. పుల్కల్ మండల సమావేశ మందిరంలో నేటి(బుధవారం) ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని పుల్కల్ ఎంపీడీవో ఆనంద్ మెర్రీ అన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సర్వసభ్య సమావేశం మండలాధ్యక్షురాలు చైతన్య విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గాజుల వీరేందర్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై సంబంధిత శాఖ అధికారులు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల మాజీ సర్పంచులకు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.



ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్‌ఫెయిర్ దోహదం

నవతెలంగాణ-జోగిపేట

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు దోహదపడుతాయని మండల విద్యాధికారి బి.క్రిష్ణ అన్నారు. జోగిపేటలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారంసైన్స్‌ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించడంతో పాటు వాటికి సంబంధించిన వివరాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి గురించి తెలుసుకోవడమే సైన్స్ అని.. సమాజం గురించి తెలుసుకోవడం సోషల్ సైన్స్ అని అన్నారు. సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని సూచించారు. అనంతరం అందోలు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల రాంబాబు మాట్లాడుతూ.. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థి దశనుంచే శాస్త్రీయ దక్పదాన్ని అలవ ర్చుకోవాలన్నారు. విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తిని పెంపొందించుకొని వినూత్న ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకొని ఉన్నత స్థానానికి ఎదుగాలన్నారు. విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలు ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయన్నారు. వీటివల్ల విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తుందన్నారు. విద్యార్థులంతా సీవి రామన్‌ను ఆదర్శంగా తీసుకొని నూతన సైన్స్ రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అనంతరెడ్డి, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ (రాజు), సభ్యులు ఫయాక్, ఉపాధ్యాయులు గౌసోద్దీన్, సిద్దేశ్వర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, నవీన్‌గౌడ్, సీని అర్టిస్టు ముప్పారం పద్మారావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్ గౌడ్

నవ తెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా అవార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఆయా వార్డుల అధికారులు సిబ్బంది కృషి చేయాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ దుర్గప్ప గారి అశోక్ గౌడ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల అధికారులతో సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో పారిశుద్ధ్యం, మంచినీటి, సమస్య వీధి దీపాల వంటి సమస్యల పరిష్కారానికి ఆయా వార్డుల అధికారులు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో ఆయా వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ మేనేజర్ వి మధుసూదన్, ఆయా వార్డుల అధికారులు బిల్ కలెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకంతో కాంగ్రెస్ నాయకుల హర్షం

నవతెలంగాణ-కౌడిపల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన గృహజ్యోతి పథకం ద్వారా గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మహమ్మద్ నగర్ లైన్‌మెన్ మల్లాగౌడ్ తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి జీరో బిల్లు ఇవ్వడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రఘు పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాకముందే ఇచ్చిన 6 గ్యారంటీల్లో సగానికి పైగా అమలు చేస్తుందని తెలిపారు. అతి త్వరలో మహిళలకు రూ.2500 గౌరవ వేతనాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ కూడా వచ్చే నెలలో మాఫీ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలాగౌడ్, దుర్గయ్య, కృష్ణ, రాములు, నర్సింలు, గణేష్, సలావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉచిత న్యాయ సహాయం

సీనియర్ సివిల్ జడ్జి జితేందర్



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్యానెల్ లాయర్స్ పిఎల్ విలతో రివ్యూ ఫంక్షనింగ్ ఆఫ్ లీగల్ ఎయిడ్ క్లినిక్లెస్ విలేజ్ కేర్ సపోర్ట్ సెంటర్‌కి సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సెక్రటరీ కమ్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ మాట్లాడుతూ ప్యానెల్ లాయర్స్ పిఎల్ విలో విధులు, ప్రీ లిటిగేషన్ కేసెస్, లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి వివరించారు.ద అదేవిధంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందరికి ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజీమున్నిసా బేగం, రామశర్మ, సిద్దాగౌడ్, సిద్దిరాములు, ప్యానల్ లాయర్స్ దుర్గా రెడ్డి, శారద, పారా లీగల్ వాలంటీర్లు అశోక్, స్వప్న, లక్ష్మి, సాయికుమార్, సౌందర్య పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 36 కోట్ల నిధులు

నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి

అదనపు కలెక్టర్ రమేష్



నవతెలంగాణ-మెదక్

ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన నిధులతో సీసీ రోడ్లను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని అదనపు కలెక్టర్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహులు, సంబంధిత ఏఈలతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ పథకం కింద రూ. 36 కోట్ల నిధులను సీసీ రోడ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎన్నికల కోడ్ దగ్గర పడుతున్న తరుణంలో ఉన్న నిధులను సక్రమంగా వినియోగిస్తూ నాణ్యతా ప్రమాణాలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మొదలుపెట్టాలని తెలియజేశారు. క్షేత్రస్థాయిలో ఎంపీడీవో, ఎంపీఓ, ఏఈలు సమన్వయంగా వ్యవహరించి 20 రోజుల వరకు పనులు పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-చేగుంట



బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, పిఎసిఎస్ రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మేకల పరమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజనకు ప్రవీణ్ కుమార్‌లు ఇటీవలే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి హరికృష్ణల నేతృత్వంలో హైదరాబాద్ లో రవాణాశాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మేకల పరమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్ కుమార్‌లకు మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితోపాటు డైరెక్టర్ స్వర్గం సిద్ధిరాములు, సాకలి రమేష్, బుడ్డ భాగ్యరాజ్, పూల బోయిన వెంకటి, బచ్చల కృష్ణా, దాసోజు కృష్ణ, పుట్ట మహేష్, సిరిసిల్ల ప్రభాకర్, గడ్డమీద రాజు, సిద్ధిరాములు, పలువురిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ కుమార్, స్టాలిన్ నర్సింలు, మాజీ సర్పంచ్ భాస్కర్, సంద్రుగు శ్రీకాంత్, సాయి కుమార్ గౌడ్, చెరుకు విజయ్, సతీష్ కుమార్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్విజ్ పోటీల బ్రోచర్ విడుదల

నవ తెలంగాణ-మెదక్ టౌన్



మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎన్ఐ ఎస్ఎం సెబి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో క్విజ్ పోటీని నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఈ క్విజ్‌ను ఆర్థిక అక్షరాస్యత అను అంశంపై జాతీయస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు శాఖాధిపతి డాక్టర్ శరత్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అన్ని గ్రూపుల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలు ఏప్రిల్ నెల చివరి వరకు కొనసాగుతాయని, విజేతలకు ఎన్ఐ ఎస్ఎం, సెబి సంస్థలు ముంబైలో జరిగే సమావేశంలో బహుమతులు అందజేస్తాయని తెలిపారు. ఈ పోటీలకు కన్వీనర్‌గా వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు హరిత వ్యవహరిస్తారన్నారు.

రేణుక ఎల్లమ్మకు బోనాలు

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల కేంద్రంలోని చేరిలా గ్రామ శివారులో రేణుక ఎల్లమ్మకు యాదవ, కురుమ సంఘ సభ్యులు మాలకుల స్తులు ప్రత్యేక బోనాలు నిర్వహించారు. ఒగ్గు కళాకారుల మధ్య రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వెండి, బంగారం ఆభరణాలు కానుకలుగా బహుకరించారు. ఒడిబియ్యాలు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజక వర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరై రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాకాలంలో పంటలు సమృద్ధిగా పండి ఇంటిల్లిపాదులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయానికి విరాళం

నవతెలంగాణ-నిజాంపేట : మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో గల హనుమాన్ దేవాలయానికి హైదరాబాద్ వాస్తవ్యుడైన ప్రైవేట్ వ్యాపారస్తుడు తోట శ్రీధర్ రెడ్డి రూ.10 వేల విలువ చేసే చెక్కును విరాళంగా అందజేశారు. హనుమాన్ దేవాలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా రూ.10 వేలను మంగళవారం రెడ్డి సంఘం నాయకులు బాల్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ హనుమాన్ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రీధర్ రెడ్డికి భగవంతుని ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోమ్మిడి హనుమంత రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సాఫ్ట్‌వేర్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలి

- విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్

ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల ఎంపిక కొరకు అవసరమైన డాక్యుమెంట్లు సేకరించి ప్రజాపాలన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలని విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి మండల ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపాలిటీలలో అవసరమైన మేర ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమం కింద క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్



మీటర్ నెంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తుందన్నారు. గృహజ్యోతి కింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నామని, ప్రజాపాలన దరఖాస్తు సమయంలో వివరాలు సరిగ్గా నమోదు చేసుకోని దరఖాస్తుదారులు, నూతన ప్రజా పాలన దరఖాస్తులను సైతం ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. ప్రజా పాలన సేవా కేంద్రాల్లో వినియోగించే సాఫ్ట్‌వేర్ పనితీరును రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. లబ్ధిదారుల ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు వివరాల ద్వారా ప్రజా పాలన దరఖాస్తును గుర్తించాలన్నారు.

అనంతరం తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ మ్యాచ్ అయితే సదరు లబ్ధిదారులను గ్యారంటీ పథకాల కింద ఎంపిక చేస్తామని, వివరాలు మ్యాచ్ కాని పక్షంలో మరోసారి సరైన వివరాలు నమోదు చేయాలన్నారు. తెల్లరేషన్ కార్డు వివరాలను ముందుగా వ్యాలిడేట్ చేయాలని, ముందస్తుగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారినిగా గుర్తించిన తర్వాత సదురు దరఖాస్తుదారులు అందించే గ్యాస్ కనెక్షన్ నెంబర్ వివరాలు, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలు వ్యాలిడేట్ చేయాలన్నారు. ఒక తెల్ల రేషన్ కార్డుపై ఒక గ్యాస్ కనెక్షన్, ఒక విద్యుత్ మీటర్ కనెక్షన్‌కు మాత్రమే గ్యారంటీ పథకాలు వర్తిస్తాయన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాలలో అవసరమైన మేర దరఖాస్తులు అందుబాటులో ఉండాలని, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రజాపాలన సేవా కేంద్రాలలో విధుల నిర్వహణ, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలలో రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్, మెదక్ వార్డులలో 10, మండలాల్లో 20 చొప్పున మొత్తం 30 ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలాల్లో ఎంపీడీవోలు అందుబాటులో ఉంటారని ప్రజలు తమ తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్ వివరాలను తీసుకుని వచ్చి ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గృహజ్యోతి, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలలో తమ అర్హతను పరిశీలించి అర్హుల వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

గుండెపోటుతో పీఏసీఎస్ చైర్మన్ మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-నార్సింగి



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ శంకర్ గౌడ్ గుండెపోటుతో మృతి చెందారు. తన అన్న నార్సింగి మాజీ సర్పంచ్ రాజా గౌడ్‌కు ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేశారు. చికిత్స పొందుతున్న అన్నను మంగళవారం ఆసుపత్రిలో పరామర్శించడానికి వెళ న్న క్రమంలో మేడ్చల్ వద్ద గుండెపోటు రావడంతో శంకర్ గౌడ్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అప్పటికే శంకర్ గౌడ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో నార్సింగి మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. శంకర్ గౌడ్ మృతి పట్ల దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నార్సింగి జెడ్పీటీసీ బాణాపురం కృష్ణా రెడ్డి, ఎంపిపి చిందం సబిత రవీందర్, వైస్ ఎంపిపి సుజాత శంకర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ ఎంపిపి ఆకుల మల్లేష్ గౌడ్, నార్సింగి తాజా మాజీ ఉపసర్పంచ్ కాలేరు యోగి, పార్టీ నాయకులు శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ భౌతిక కాయానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకర్ గౌడ్ ఉద్యమ నాయకుడని, మొదటి నుంచి పార్టీ కోసం ఒక కార్యకర్త లాగా, ఒక నాయకునిలాగా ఎంతో కృషి చేశారని, పార్టీ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనే వారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు తాను, బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తామని, తమ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, మండల అధ్యక్షుడు, ఎంపిపి లు శంకర్ గౌడ్‌తో తమ అనుబంధాన్ని, తనతో గడిపిన సమయాన్ని గుర్తు చేసుకుని కంట నీరు పెట్టుకున్నారు.

అప్పుల బాధ భరించ లేక యువకుని ఆత్మహత్య

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధి గ్రామమైన వల్లూరుకు చెందిన ఆనందాస్ మహేష్ (35) అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మహేష్ భార్య భాగ్యలక్ష్మి, ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దిన్‌ల కథనం ప్రకారం వల్లూరు గ్రామానికి చెందిన ఆనందాస్ మహేష్ వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. గత కొంత కాలం క్రితం తనకున్న వ్యవసాయ భూమిని అమ్ముకున్నాడని, అప్పటి నుంచి మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 4వ తేదిన సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మిన భూమిని తలచుకుంటూ, ఆత్మహత్య చేసుకుంటానని బాధపడుతూ ఇంట్లోనే కూర్చున్నాడు. రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో ఇప్పుడే వస్తానని తన భార్య భాగ్యలక్ష్మితో చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రంతా ఇంటికి తిరిగి రాలేదు. ఈ నెల 5న మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన ఎల్లబోయిన నీలకంఠం ఫోన్ చేసి గ్రామ సమీపంలోని మాల గుట్టపై చింత చెట్టుకు ఉరి వేసుకొని మహేష్ చనిపోయాడని తెలుపగా, భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులతో వెళ్ళి చూడగా చెట్టుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఉన్నాడని తెలిపారన్నారు. అది చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దిన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, భాగ్యలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అప్పుల బాధ భరించలేక తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, తనకు ఎవరిపైనా ఎలాంటి అనుమానాలు లేవని ఆనందాస్ భాగ్యలక్ష్మి తెలిపిందని పేర్కొన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుని భార్య భాగ్య లక్ష్మి విజ్ఞప్తి చేశారు

పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా శృతి, ఎంఈఓగా అజయ్, డిఇఓగా అశ్రఫ్, ఉపాధ్యాయులుగా శ్రీవల్లి, శ్రీవర్ష, అభిరాం, విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయులు వినయ్, అరుణ, విజయ, స్వామి, నర్సింలు, వినోద్, శ్వేత, బాలలక్ష్మి, పావని, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించాలి

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-కొండపాక: ఉపాధి హామీ కూలీల వేతనాలు అందక నెలలు గడుస్తున్నాయని వెంటనే చెల్లించాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి తెలిపారు. మంగళవారం కుకునూరుపల్లి మండలం ముద్దాపూర్, తిప్పారం గ్రామల్లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు కూలీ డబ్బులు అందక పోవడంతో పనులు చేయడానికి కూలీలు ముందుకు రాలేకపోతున్నారన్నారు. ముద్దాపూర్ లో నర్సరి, చెట్ల తొలగింపు పనిచేసిన కూలీలకు నాలుగు నెలలు గడు స్తున్నా వేతనాలు రాలేదన్నారు. తిప్పారం గ్రామంలో కట్ట దగ్గర చెట్లు తొలగించిన పనికి డబ్బులు రాక సంవత్సరం అవుతుందన్నారు. అలాగే ఉపాధి హామీ కూలీల దగ్గర మెడికల్ బాక్స్ లు లేవని టెంట్లు వేయడం లేదని వాపోయారు.

బదిలీ అయిన రాజర్షి షాకు ఘనంగా వీడ్కోలు

- జిల్లాలో 13 నెలల పాటు సేవలు
- నేడు కొత్త కలెక్టర్‌గా రాహుల్ రాజ్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-మెదక్

మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదిలాబాద్ జిల్లా కలెక్టర్ గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాహుల్ రాజ్ పీఎస్‌ను నియమిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు రమేష్ అధ్యక్షతన కలెక్టర్ రాజర్షి షాకు అధికార యంత్రాంగం వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన రాజర్షి షా 31 జనవరి 2023 న మెదక్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లాలో 13 నెలల పాటు కలెక్టర్‌గా విశేష సేవలందించిన రాజర్షి షా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానచలనం అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ఓటర్ నమోదు శాతం పెంపు, ఏడుపాయల జాతర, కొత్త కలెక్టరేట్ ప్రారంభోత్సవం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజావాణిలో సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ తనదైన శైలిలో ముందుకు సాగారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాను: కలెక్టర్ రాజర్షి షా

జిల్లా కలెక్టర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అందరి శాఖల సమన్వయం చేసుకుంటూ జిల్లాలో ఏడుపాయల జాతర, కొత్త కలెక్టరేట్ ప్రారంభోత్సవం, చీఫ్ జస్టిస్ పర్యటన, శాసనసభ ఎన్నికల్లో, ఓటర్ నమోదులో ఉన్నత సేవలు అందించానని, ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలపై స్పందిస్తూ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు జిల్లా యంత్రాంగం అందించిన సహాయ సహకారాలు మరువలేనివని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. విద్య, వైద్యం సమ పాలనలో అందించినప్పుడే మంచి సమాజాన్ని నిర్మించవచ్చని వైద్య పరంగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, విద్యాపరంగా ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని క్షేత్రస్థాయిలో పాఠశాలలను ప్రత్యేక అధికారులు పర్యటించి విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలను, సదుపాయాలను పరిశీలించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా అధికారులు తీసుకుంటున్న చర్యలు హర్షించదగ్గ విషయమని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ యంత్రాంగం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుటకు విశేష కృషి చేశారని అభినందించారు. సమర్థవంతమైన అధికారుల సమక్షంలో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి సమన్వయంతో పని చేశానని సగర్వంగా వివరించారు. ఉద్యోగుల సమస్యలపై వారి ఆంక్షలు నెరవేర్చడానికి ఉద్యోగ సంఘాల



సమస్యలను అర్థం చేసుకున్నట్లు వివరించారు. మెదక్ నూతన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోనున్న రాహుల్ రాజ్‌కు ఇదే స్ఫూర్తిని అందించి జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నిలపాలని ఆకాంక్షించారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న రాజర్షి షా ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, టిఎన్జీవో నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పూల బొకేలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డి ఏపిడి శ్రీనివాసరావు, ఆడిషనల్ ఎస్పీ మహేందర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, టీఎన్జీవో ప్రెసిడెంట్ దొంతి నరేందర్, టీఎన్జీవో ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, డిసిహెచ్ఓ పి చంద్రశేఖర్, ఏడి మైన్స్ జయరాజ్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


నేడు మెదక్ జిల్లా కలెక్టర్‌గా రాహుల్ రాజ్ బాధ్యతల స్వీకరణ

మెదక్ జిల్లా కలెక్టర్‌గా రాహుల్ రాజ్ బుధవారం బాధ్యతలను స్వీకరించనున్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి


నవ తెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్



జిల్లా సమీకృత మినీ కాన్ఫరెన్స్ కార్యాలయంలో గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాల లబ్ధి కొరకు ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుండి గుర్తింపు కార్డులను సేకరించి డాటా కరెక్షన్ చేయాలని మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రస్థాయి అధికారులు జిల్లా కలెక్టర్లను, జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు మరి 23 ఎంపీడీవో కార్యాలయాలలో ప్రజా పాలన సేవ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల నుండి సంబంధిత గుర్తింపు కార్డులను సేకరించి నిర్దేశిత సమయంలోగా అవసరమైన వారి డాటాను దిద్దుబాటు చేస్తామని రాష్ట్ర స్థాయి అధికారులకు తెలిపారు.

పెద్ద మసాన్ పల్లిలో స్వయం పరిపాలన దినోత్సవం


నవతెలంగాణ-తొగుట



పెద్ద మసాన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా యశ్వంత్ కుమార్, ఉపాధ్యాయులుగా అభిలాష్, అజయ్, ప్రణయ్, చరణ్, చరిష్మా, సంజన, సాత్విక, వైష్ణవి, లికిత, వర్షిని, రమ్య, సాత్విక, శివ పాల్గొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయులు జి రాజు, ఉపాధ్యాయులు, శ్రీనివాస్ రెడ్డి, దుర్గారెడ్డి, మమత, శ్రీలత, కవిత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


ఘన వ్యర్థాల నిర్వహణపై డిజిటల్ ప్రచారం

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట రూరల్ మండలం గ్రామ పంచాయతీల పరిధిలో సాహస్ ఎన్.జీ.ఓ ఆధ్వర్యంలోని సి.జీ.ఐ వారి సౌజన్యంతో సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రాజెక్ట్ పై "ఐ.ఈ.సి ప్రచార వాహనం" ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు సాహస్ ఎన్.జీ.ఓ సిద్దిపేట మేనేజర్ కెమ్మసారం శేఖర్ తెలిపారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట రూరల్ మండలంలో గల 14 గ్రామపంచాయితీలలో ప్రత్యేకంగా రూపొందించిన లఘు చిత్రాన్ని, ఎల్ఈడితో కూడిన వ్యాన్ ద్వారా డిజిటల్ ప్రచారం ఐదురోజుల పాటు చేపట్టడం జరుగుతుందనీ తెలిపారు. చెత్తను బయట పడేయడం , కాల్చడం వల్ల జరిగే అనర్థాలు, నష్టాలు, దాని ద్వారా ప్రజలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, చెత్తను తడి - పొడి - ప్రమాదకరమైన చెత్తగా వేరుచేసి ఇవ్వడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సాహస్ ఎన్.జీ.ఓ కో - ఆర్డినేటర్ చిన్న, ఫీల్డ్ సూపర్ వైజర్లు బి.బాలరాజు గౌడ్, సుమాదేవి, దుర్గాప్రసాద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ కళావేదిక దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షులుగా సాయికిరణ్‌రెడ్డి



నవ తెలంగాణ - మిరుదొడ్డి : తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం మలిదశ ఉద్యమంలో. తెలంగాణ ప్రజలను చైతన్య పరుస్తూ అనేక ప్రజా పోరాటాల్లో ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచి రాష్ట్రం సాధించడంలో కీలకంగా పనిచేసిన ఉద్యమ కళాకారులమైన తమకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరిగిందని సాయికిరణ్‌రెడ్డి అన్నారు. నకిరేకంటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా తెలంగాణ కళావేదిక అనే సంఘాన్ని స్థాపించారు. సాయికిరణ్‌రెడ్డిని తెలంగాణ కళావేదిక దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షులుగా నియమితులయ్యారు. తనపై నమ్మకంతో దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షునిగా ఎన్నుకోవడం నా కళకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు సాయికిరణ్ అన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు నకిరే కంటి కిరణ్ కుమార్‌కు, రాష్ట్ర గౌరవ సలహాదారులు మద్దెల నర్సింలు, తెలంగాణ కళావేదిక సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బొల్గం రాజేష్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

అంధుల జీవన భృతి కోసం విద్యార్థుల విరాళం

నవ తెలంగాణ - సిద్దిపేట



పట్టణానికి చెందిన సహస్రవిద్యాలయం విద్యార్థులు సోచ్ ఫౌండేషన్‌లోని అంధుల జీవనభృతి కొరకు రూ 29,500 విరాళంగా పాఠశాల చైర్మెన్ దరిపల్లి చంద్రం చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేసిన సహాయం వారి మంచిమనసుకు నిదర్శనం అని అన్నారు. పార్థించే పెదవుల కన్న సహాయం చేసే చేతులే మిన్న అని అన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రావణ్ , ప్రిన్సిపల్ శాంతి కిరణ్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయాలి

నవతెలంగాణ- గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్నులు ,నల్లా బిల్లులు, వ్యాపార ట్రేడ్ పన్నులు 100 శాతం వసూలు చేయాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

పెన్షన్ అమలు చేయాలి

- కౌన్సిలర్ గంగిశెట్టి చందనా రవీందర్



నవతెలంగాణ- గజ్వేల్

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు వేల పెన్షన్ 4000 కి చేస్తామని మాట ఇచ్చి తప్పిందని ఇంతవరకు అమలు చేయడం లేదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ గంగిశెట్టి చందనా రవీందర్ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ముందుగా పెన్షన్ అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పెన్షన్ పెరుగుతుందని ఆశతోని మహిళలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారని ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వంపై భారం పడుతుందని భావించిన సీఎం రేవంత్ రెడ్డి పెన్షన్ పెరుగుదల పథకాన్ని పక్కకు పెట్టినట్టు ఉందని ఆమె అన్నారు. మహిళల కోసం ఉచిత ప్రయాణం పథకం బాగానే ఉన్నప్పటికీ బస్సుల సంఖ్య పెంచి గ్రామీణ ప్రాంతాలకు ఈ పథకాన్ని చేర్చాలన్నారు. కేవలం ప్రధాన రోడ్లకే ఉచిత బస్సు ప్రయాణం పరిమితమైందని ఇది గ్రామాలకు చేరాలంటే మరిన్ని బస్సులను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపోకు కేటాయించి గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న 175 గ్రామపంచాయతీలకు బస్సులను నడపాలని ఆమె కోరారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పెండింగ్ పనులను కొత్త ప్రభుత్వం పూర్తి చేయాలని ఆమె కోరారు.

రేబర్తిలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభ



నవతెలంగాణ-మద్దూరు: మండలంలోని రేబర్తి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో 1 ఏప్రిల్ 2022 నుండి మార్చ్ 31-2023 వరకు జరిగిన పనులపై గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం వివిధ రకాల పనులను పరిశీలించి గ్రామ సభలో ప్రజలకు వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డీఆర్పి వెంకటేష్, ఈసీ పరశురాం, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంజుమానే మూహబ్బనే ఉర్దూ ఆధ్వర్యంలో గ్రాండ్ ముషాయిరా



నవతెలంగాణ - సిద్దిపేట

అంజుమానే మూహబ్బనే ఉర్దూ సంస్థ ఆధ్వర్యంలో గ్రాండ్ ముషాయిరా బుధవారం నిర్వహిస్తున్నామని సంస్థ బాధ్యులు అరిఫ్ ముజఫ్ఫార్, సుబ్బుర్ తెలిపారు. మంగళవారం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మిస్కీన్ అహ్మద్ ఆధ్వర్యంలో గత 45 సంవత్సరాల నుండి ఆనవాయితీగా వస్తున్న ఉర్దూ కవి సమ్మేళనం సిద్దిపేట లో నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. బుధవారం రాత్రి 9 గంటల నుండి మదీనా ఫంక్షన్ హాల్లో ప్రారంభమయ్యే కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయి ఉర్దూ కవులు పాల్గొంటారని తెలిపారు. బెహరేయిన్ నుండి అన్వర్ కమాల్, నేపాల్ నుండి సర్వర్ నేపాలీ, కువైట్ నుండి నజీన్ అలీ నాజ్, జెద్దా నుండి సమీరా అజీజ్, వివిధ రాష్ట్రాల నుండి అహ్మద్ జియా, టీపీకల్ జగిత్యాల్, లతీఫుద్దీన్ లతీఫ్, ఖుర్షిద్ కసర్, ఇతర కవులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో అతీక్ అహ్మద్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచల దేవస్థానానికి తలంబ్రాల కానుకల హుండీలు



నవతెలంగాణ -గజ్వేల్

సీతారాముల కళ్యాణ అనంతరం భద్రాచల దేవస్థానం వారు ముత్యాల తలంబ్రాలను మంగళవారం గజ్వేల్ పట్టణంలోని శ్రీరామకోటి భక్త సమాజం వారికి అందించింది. ఆ తలంబ్రాలను సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు రామకోటి భక్తులకు అందించారు. వారు తనకు తోచిన ఆర్థిక సహాయం హుండీలో వేశారు. రెండు హుండీలను భద్రాచల దేవస్థాన ఏఈవో శ్రావణ్ కుమార్‌కు మంగళవారం భద్రాచల దేవస్థానంలో అందజేశారు. ఆ హుండీ ద్వారా రూ. 22వేలు వచ్చాయి. ఆ కానుకలను అక్కడే ఉన్న భద్రాచల దేవస్థాన హుండీలో అధికారులు వేశారు.

బహిరంగ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



నవతెలంగాణ-మర్కుక్

సంగారెడ్డి నియోజకవర్గంలో నిర్వహించిన బిజెపి భారీ బహిరంగ సభకు మర్కుక్ మండల బిజెపి శ్రేణులు, బిజెపి మర్కుక్ మండలాధ్యక్షులు టి.రమేష్ గుప్తా,సాయిరెడ్డి రాంరెడ్డి అధ్వర్యంలో బారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికలలో బిజెపి అత్యధిక స్థానాలు గెలుచుకోనుందన్నారు. దేశంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సుర్వి కృష్ణ మూర్తి, రాజేందర్ సింగ్, తిరుపతి రెడ్డి,మహేష్ గౌడ్, సామేల్,లింగ సత్యనారాయణ, సంజీవరెడ్డి, కుమార్, తదితరులున్నారు.

12న సామాజిక తనిఖీ ప్రజావేదిక



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు దూల్మిట్ట మండలంలో 1-4-2022 నుండి 31 -3-2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12న ఉదయం 10 గంటలకు 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామ్ మోహన్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు

ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తుల అందజేత



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి ఉచితంగా విద్యుత్ అందించే పథకం కోసం ప్రజలు మున్సిపల్ కార్యాలయం లో భారీగా దరఖాస్తులను మంగళవారం అందజేశారు. 200 లోపు యూనిట్లను వినియోగిస్తున్న వారికి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని చెప్పడంతో, ప్రజలు ప్రజా పాలనలో చేసుకున్న దరఖాస్తు, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు, రేషన్ కార్డు జిరాక్స్‌ను అందజేస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెండు కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఇటీవల నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ కమిషనర్ గోల్కొండ నర్సయ్యను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మూడో వార్డు కౌన్సిలర్,లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్ మార్కంటి వరలక్ష్మి కనకయ్య ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కమిషనర్ గోల్కొండ నర్సయ్య ను కలిసి శాలువాతో సన్మానించి, స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రజల నుండి అధికారులకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సంపూర్ణ సహకారాలు లభిస్తాయన్నారు. సన్మానం అనంతరం స్పందించిన కమిషనర్ పేద,ధనిక అనే తేడాలేకుండా ప్రజల సమస్యల పరిష్కరించడమే తమ ధ్యేయమన్నారు. ఏ ఒక్కరికి సమస్య ఉన్న నేరుగా తనను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు కదుల్ల ఎల్లేశం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుర్ర మహేందర్ రెడ్డి, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు,దూల్మిట్ట మండలంలోని మద్దూరు,లద్నూరు, దూల్మిట్ట జడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎగ్జామ్స్ కిట్లు పంపించడంతో వాటిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖజా ఆరిఫ్,దూల్మిట్ట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంద యాదగిరి,ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి ఏ రాకేష్ రెడ్డి, ఎంఈఓ మొగుళ్ల నరసింహారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జీడి కంటి సుదర్శన్, ముదిరాజ్ సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి సాగర్, బిఆర్ఎస్ మద్దూరు గ్రామ శాఖ అధ్యక్షుడు దామెర మల్లేశం, నాయకులు నాచగోని వెంకట్ గౌడు, బర్మా రాజ మల్లయ్య, బొప్పే నాగయ్య, కోడూరు జిలాని సిద్దిక్, అబ్బుషరీఫ్, ఖలీల్, బెడద కుమారస్వామి, ఎస్ఎంసి చైర్మన్ పాకాల జయ ఇసాక్, బిఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ పాకాల కిరణ్ కుమార్,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకన్న, పిడి ప్రేమ్ కుమార్, పి ఈ టి విష్ణు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లలోనే వేల టన్నుల పత్తి నిలువ

- ముగిసిన సీజన్.. కొనేందుకు రంగంలోకి దళారులు
- ఈ ఏడాది ఆశించిన ధర రాలేదంటున్న రైతులు

నవతెలంగాణ-గజ్వేల్

జిన్నింగ్ మిల్లుల కింద ఉన్న దళారులు రంగంలో దిగారు. నిల్వ ఉన్న పత్తిని కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 96 వేలపత్తి టన్నుల పత్తిని కొనుగోలు చేశారు. అయితే పత్తి రైతులు ఆశించిన గిట్టుబాటు ధర లభించలేదు. ఎకరాకు రూ 15 వేల నుంచి రూ 20 వేల వరకు ఖర్చు వచ్చిందని రైతులు చెప్తున్నారు. మార్కెట్లో ధర పలికినప్పటికీ సీసీఐ అధికారులు ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు చాలామంది ఇంట్లోనే పత్తిని నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం సీజన్ ముగిసింది అని అధికారులు ప్రకటించడంతో ప్రైవేట్ వ్యాపారులు రంగంలో దిగారు. గత ఏడాది 2023 అక్టోబర్ నుంచి కొనసాగిన కొనుగోళ్లు ఫిబ్రవరితో సమాప్తమయ్యాయి. పత్తికి ఈసారి ధర తగ్గిపోయి నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రూ. వేలకువేలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేయగా అవికూడా చేతికందక నష్టాలెదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ మొదట్లో బహిరంగ మార్కెట్లో క్వింటాలు పత్తి ధర రూ.7300 పలికింది. మరింత ధర పెరుగుతుందని ఆశించిన రైతులకు ధర పెరగక నిరాశ మిగిలింది. క్వింటా ధర రూ.7 వేల దిగువకు పడిపోవటంతో ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 23 జిన్నింగ్ కేంద్రాల్లో 2023 నవంబర్ నుంచి సీసీఐ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొంత ఊరట లభించినట్లైంది.

గడిచిన వానాకాలం సీజన్ లో జిల్లా వ్యాప్తంగా 1.08 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఎక్కువగా గజ్వేల్‌తోపాటు చిన్నకోడూరు. తొగుట, కొండపాక, దౌల్తాబాద్, బెజ్జంకి, హుస్నాబాద్, చేర్యాల తదితర మండలాల పరిధిలో సాగు చేశారు. ఎకరాకు గరిష్ఠంగా 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఇప్పటిదాకా 41,182 మంది నుంచి వ్యాపారులు 21,846 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేశారు. సీసీఐ 47,348 మంది రైతుల నుంచి 74,569 టన్నులు కొనుగోలు చేసింది. మరింత ధర పెరుగుతుందని భావించిన కొందరు రైతులు ఇండ్లలో ఇంకా నిల్వ చేసుకున్నారు. ఇదిలా ఉండగా జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు ఊరూరా తిరుగుతున్నారు. ఇంటిలో పత్తిని విక్రయించాలని రైతుల వద్దకు జిన్నింగ్ మిల్లుల కింద ఉన్న



దళారులను పంపుతున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-మిరుదొడ్డి : అక్బర్ పేట భూంపల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాల కూడవెళ్లిలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిగా ఎమ్మ అఖిలేష్, మండల విద్యాధికారిగా సాదుల సాత్విక, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా ఎనగంటి నితీష, నోడల్ అధికారిగా అన్న బోయిన సాత్విక్, ప్రధానోపాధ్యాయులుగా ఎనగంటి కీర్తన, పిఈటిగా ఎనగ^ంటి రిత్విక్, ఉపాధ్యాయులుగా ఎనగంటి హరిత, చెరుకు సాత్విక, ఎనగంటి వర్ధిని వ్యవహరించారు. పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పాఠశాల ఉపాధ్యాయులు జి.శివాజీ, పి.వి. సత్యకుమార్ గార్లు బహుమతులు అందించారు.

రుద్రారం పాఠశాలలో..

రుద్రారం ప్రాథమిక పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి మండల నోడల్ అధికారి అంజాగౌడ్ అతిథి గా విచ్చేసి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ ను కనబరుస్తున్నారని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ర్యాకం మల్లేశం మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో చదివి జీవితం లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు,. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిగా పాలమాకుల హృదయ్ వరుణ్, మండల విద్యాశాఖ అధికారిగా గోరిటి శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా మాడుగుల ప్రదీప్, పి ఈ టి గా అనంతుల యశ్వంత్ కుమార్, ఉపాధ్యాయులుగా సావిత్రి , ధరణి, సాధిక, సాత్విక,.సన, ప్రత్యూష, అక్షయ్,సుమయ, ఆరాధన, ఆదిత్య, అవినాష్, అశ్వంత్, చాందినీ,హర్షవర్ధన్ , మన్విత్ ,అరవింద్, అక్షయ్, వరుణ్ తేజ్ వ్యవహరించారు.,,, అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపూర్వకంగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వెంకటరాజం, రామచంద్ర, బాలకృష్ణ, భవాని, అనిత, పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం ముంద్రాయి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో పై తరగతి చదువుతున్న విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. జిల్లా విద్యాశాఖాధికారిగా సంతోష్, మండల విద్యాశాఖాధికారిగా సాయి నందన్‌రావు, ప్రధానోపాధ్యాయులుగా అర్చన, మరి కొంత మంది ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, ఉపాధ్యాయులు యాదమ్మ, మాధవి లత, రాజేందర్, స్వరూప రాణి,అనంత లక్ష్మి, లక్ష్మయ్య పర్యవేక్షించి అభినందనలు తెలిపారు.







గృహజ్యోతితో ప్రతి ఇంటిలో వెలుగులు

- పిసిసి ప్రధాన కార్యదర్శి నాయిని యాదగిరి



నవతెలంగాణ-గజ్వేల్

గృహ జ్యోతితో ప్రతి ఇంటిలో వెలుగులు నింపుతున్నామని పిసిసి ప్రధాన కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లి గ్రామంలో ఉచిత విద్యుత్ బిల్లులను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కృషితో గృహజ్యోతి అమలవుతుందన్నారు. 200 యూనిట్ల విద్యుత్తు ఉచిత బిల్లును ఆయన అందించారు. మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీట వేస్తూ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఉచిత విద్యుత్తు ఎంతోమందికి లాభం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తుందని ఆయన చెప్పారు. ఉచిత ప్రయాణం మహిళలకు వరంగా మారిందన్నారు. బస్సుల సంఖ్య పెంచి మహిళలను మరింతగా ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈనెల 11న ఇందిరమ్మ ఇండ్ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రవేశపెడతారన్నారు. దీంతో పేదలకు ఇల్లు నిర్మించే అవకాశం ఉందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలో పథకాలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నక్క రాములు, లక్ష్మణ్, రాజు రెడ్డి, కృపానందం, చంద్రం, కరుణాకర్, మల్లారెడ్డి, శివులు, బాబా, అజ్గర్, నర్సింలు, రవి, సత్యనారాయణ, లింగం, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపు కోవడమే ధ్యేయంగా ఎల్ఆర్ఎస్‌ను తెర పైకి తెచ్చిందని, ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలనీ రియల్ వ్యాపార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం రాజలింగం అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు గ్రామ పంచాయతీ లేవుట్లను ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ ఆర్ ఎస్ కట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రియల్ ఎస్టేట్ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. గ్రామాల్లో సర్పంచ్ ల పదవికాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన ఉన్నదని, వారు పాత వెంచర్ల హద్దురాళ్లను తొలగిస్తున్నారన్నారనీ, దీంతో స్థల యజమానులు ఆందోళనకు గురైతున్నారని వాపోయారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ధర్నాకు జిల్లా పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జువ్వన శంకర్, వంగ మల్లారెడ్డి, కోశాధికారి మొరంశెట్టి ప్రవీణ్, గుండ్ల జనార్ధన్, జల్లపల్లి క్రిష్ణ, శ్రీరాం శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, కడవేర్గు రాజు పాల్గొన్నారు.

కోనాయిపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్





నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన దువ్వల శ్రీనివాస్ కు డాక్టరేట్ లభించింది. సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకుడిగా 2010 నుండి బాధ్యతలను కొనసాగిస్తున్నారు. లిమ్నోలాజికల్ స్టడీస్ ఆఫ్ పెద్ద చెరువు రాజగోపాల్ పేట అనే అంశంపై 2017 నుండి 2023వ సంవత్సరం వరకు పరిశోధన చేసినందుకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డీ. డిగ్రీని అందుకున్నారు. ఈ పరిశోధనకు మార్గదర్శిగా ఆచార్య కె. శైలజ వ్యవహరించారు. కోనాయిపల్లి కి సమీపంలో ఉన్న రాజగోపాల్ పేట పెద్దచెరువు రైతులకు సాగుచేయుటకు, జాలరులు చేపలను పెంచుటకు అనువైనది. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగంలో అనుభవం కలిగిన దువ్వల శ్రీనివాస్ పి.హెచ్.డీ. పరిశోధనా అంశంగా ఎంచుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె రాణి, పీజీ విభాగాల కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్య రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్. మధుసూదన్, అధ్యాపకులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

వ్యాధిని గుర్తిస్తే కాన్సర్‌ను జయించవచ్చు

- ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ హరీష్ కంచర్ల



నవతెలంగాణ-సిద్దిపేట

ఎలాంటి కాన్సర్ వ్యాధిని అయిన ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చని ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ హరీష్ కంచర్ల అన్నారు. మంగళవారం సిద్దిపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట పట్టణానికి చెందిన 4 సంవత్సరాల చిన్నారి కాళ్ళు నడవలేని పరిస్థితి లో తమ దగ్గరికి వచ్చిందని, అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత బ్లడ్ కేన్సర్ గా నిర్ధారించామని తెలిపారు. గడిచిన రెండేళ్ల నుండి చిన్నారికి కీమో చికిత్స అందించామని, ఇప్పటివరకు 11 సెషన్లు పూరయ్యాయి అన్నారు. ప్రస్తుతం చిన్నారికి పూర్తి స్థాయిలో క్యాన్సర్ నయం అయ్యిందని, మరో మూడేండ్లపాటు జాగ్రత్తగా చిన్నారిని కనిపెట్టుకొని ఉండాలని తెలిపారు. బ్లడ్ క్యాన్సర్ల లో సక్సెస్ రేట్స్ కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ ద్వారా 80-90 శాతం మించి వుంటుందని చెప్పారు. చికిత్స తర్వాత మనలాగే పూర్తిగా సాధారణ జీవితాన్ని గడపవచ్చన్నారు. లుకేమియా, లింఫోమా, మల్టిపుల్ మైలోమా వంటి వివిధ రకాల క్యాన్సర్‌లు ఉంటాయన్నారు. భారతదేశంలో రక్త క్యాన్సర్ల సంవత్సరానికి లక్ష జనాభాకు 5.5 కేసులు నమోద వుతున్నాయని అన్నారు. దీని ప్రకారం భారతదేశంలో సంవత్సరానికి 80,000 కొత్త రక్త క్యాన్సర్లు నిర్ధారణ అవుతున్నాయన్నారు. భారతదేశంలో ప్రతి 7 సెకన్లకు ఒక కొత్త రక్త క్యాన్సర్ నిర్ధారణ అవుతుందని అన్నారు. బ్లడ్ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం వల్ల పూర్తిగా నయం చేయవచ్చు అన్నారు. ఆధునిక కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ వంటి అత్యంత అధునాతన చికిత్సాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయన్నారు. యశోద ఆసుపత్రిలో క్యాన్సర్ కు సంబంధించిన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ పరమేష్, అసిస్టెంట్ మేనేజర్ సంజీవ్ పాల్గొన్నారు.

ప్రభాకర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

- యు ఈ ఈ యు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నగదు అందజేత



నవతెలంగాణ-గజ్వేల్

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీ ఐ టీ యూ గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మర్కుక్ ఆపరేటర్ నక్క ప్రభాకర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఆయనకు ఆర్థిక సాయం అందించేందుకు మంగళవారం స్థానిక ట్రాన్స్కో కార్యాలయంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మరణించిన నక్క ప్రభాకర్ సతీమణి కృష్ణవేణి కి గజ్వేల్ డివిజన్ ఆఫీస్ లో గజ్వేల్ డి ఇ భాను ప్రకాష్ చేతుల మీదుగా యూనియన్ నుండి అధికారులు, ఉద్యోగస్తులు, కార్మికులు అందరి సహాయ సహకారాలతో ఆర్థిక సహాయంగా రూ 66,000 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమలో ఎ డి ఇ జగదీష్ , ఎఈ సుధీర్, ఎఈ బాబయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సంద బోయిన ఎల్లయ్య, టిఎస్ఎస్‌పిడిసి ఎల్ కంపెనీ అధ్యక్షులు సింగిరెడ్డి చంద్ర రెడ్డి, డివిజన్ అధ్యక్షులు డప్పు పరుశరాములు, డివిజన్ ఉపాధ్యక్షులు చంద్రం యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సధాకర్, అర్ రవికుమార్ గౌడ్, జిల్లా జాయింట్ సెక్రెటరీ యాదగిరి యాదవ్ నాయకులు శ్రావణ్, చంద్రారెడ్డి, గోవర్ధన్, మురళి, ప్రవీణ్ మహేష్ ,నర్సింలు , శ్రీకాంత్ ,వెంకటేష్ జే ఎల్ ఎం. అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ ఇసుక తయారుచేస్తున్న స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు





నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఫిల్టర్ ఇసుక తయారుచేస్తూ ట్రాక్టర్‌లో అక్రమ రవాణా చేయడంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం విశ్వసనీయ సమాచారం మేరకు గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బూర్గుపల్లి గ్రామ శివారులో వాగులో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఫిల్టర్ ఇసుక తయారుచేస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. ఇసుకను ఫిల్టర్ చేసి అమ్ముతున్నారని తమకు వచ్చిన సమాచారం ఆధారంగా సిద్దిపేట టాస్క్ ఫోర్స్, గజ్వేల్ పోలీసులు వెళ్లి దాడి చేశామన్నారు.ఎలాంటి నెంబరు లేని ట్రాక్టర్ జాన్ డియర్ ఇసుక లోడుతో పట్టుకున్నామన్నారు. గజ్వేల్ పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా, పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా చట్టవ్యతిరేకమన్నారు.చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667447, 8712667446, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

నేడు సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన

నవతెలంగాణ-చేర్యాల

ఆధునిక సాంకేతిక విధానంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేడు(బుధవారం)ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండీ. అఫ్రోజ్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో సీఎం తోపాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,వ్యవసాయ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

మృతుని కుటుంబానికి అర్థికసాయం



నవతెలంగాణ-మర్కుక్: మండల పరిధిలోని పాములపర్తి చెక్కల అచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మర్కుక్ మాజీ ఎంపీటీసీ గీత రాంరెడ్డి, తాడురి మహేశ్ గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు .రాజు టి.స్వామి గౌడ్ , ఎ. స్వామి, ఎల్. సురేష్ ,బి. స్వామి తదితరులున్నారు.

ఆడపిల్లలకు ఆదర్శం కవిత



నవతెలంగాణ-అక్కన్నపేట

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం లోని పెద్ద తండా గ్రామపంచాయతీలోని నిరుపేద గిరిజన యువతి గుగులోతు కవిత కోర్టు ఉద్యోగం సాధించినందుకు మంగళవారం తండావాసులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకొని జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి, ఎంతోమంది గిరిజన ఆడపిల్లలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కోర్టులో ఆమె బాధ్యతలు స్వీకరించినందున తండావాసులు కవితకు, ఆమె తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుగులోత్ రాంబాబు నాయక్, గుగులోతు భాస్కర్ నాయక్, జోమ్లాల్ నాయక్, నరసింహ నాయక్, తిరుపతి నాయక్, బుక్య కసనా నాయక్, రాజు నాయక్, రవి రమేష్,నరేందర్, గుగులోతు రమేష్,వీరన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 06 మార్చి 2024 | www.navatelangana.com

స్వచ్ఛ దుబ్బాకకు ప్రజలు సహకరించాలి : కమిషనర్ రమేష్



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాకను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కోరారు. చెత్తను ప్రధాన వీధులు, ఖాళీ స్థలాలు, మురికి కాలువల్లో పడవేయొద్దని, చెత్త సేకరణ వాహనంలో మాత్రమే వేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని పలు వార్డుల్లో ఉదయపు నడక చేస్తూ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంచార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దిలీప్ పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు.

మోహన్‌కే వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మెన్?

- నర్సారెడ్డి మద్దతుదారుడు బంటు మోహన్
- ఆశావహులకు నిరాశేనా?

నవతెలంగాణ-ములుగు

వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్‌కె దక్కుతుందని విశ్వసనీయ సమాచారం. ములుగు మండల పరిధిలోని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం చాలామంది పోటీలో ఉన్నారు. ఎవరికి వారే తమకే దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. అయితే, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సిరెడ్డి గ్రామమైన మోహన్ వైపు మొగ్గు చూపారని వార్తలు వినిపిస్తున్నాయి. నర్సారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మోహన్ ఎంపీపీ గా ఉన్నాడు. నర్సారెడ్డికి మద్దతుదారుడిగా నిలిచారు. దీంతో మార్కెట్ కమిటీ పదవిని మోహన్‌కే కట్టబెట్టడం ఖాయమని తెలుస్తోంది. అయితే చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న ఎంతోమంది తమ ప్రయత్నాలు మానలేదు. కొంతమంది నర్సారెడ్డి దగ్గర, మరి కొంతమంది మంత్రి పొన్నం ప్రభాకర్ దగ్గర, మరి కొంతమంది రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డి దగ్గర, కొంతమంది మంత్రి దామోదర రాజనర్సింహ దగ్గర పైరవీలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. గత ప్రభుత్వం ముంపు గ్రామస్తులకు వైస్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. ఈ ప్రభుత్వం ముంపు గ్రామస్తుల సమస్యలను పట్టించుకునే తీరు కనబడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ



స్థాయి నాయకులను మమ్మల్ని పట్టించుకోవడం లేదు ఎందుకు అని అడిగితే 'పార్టీ అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా కాలేదు తొందరపడకండి" అని చెబుతున్నట్టు తెలిసింది. అయినా నాయకులు కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఎవరి పైరవీలు వారు చేసుకుంటూ బిజీగా ఉన్నారు. కానీ కాంగ్రెస్ అధిష్టానం మాత్రం నియోజకవర్గ ఇన్చార్జ్ ఎవరి పేరు ఫైనల్ చేస్తే వారినే ఖరారు చేసే చేసే అవకాశం ఉంది. ఎవరివైపే అనేది ఉత్కంఠ నెలకొంది.

రామాయంపేట మార్కెట్ చైర్మన్ గిరి ఎవరిని వరించునో?

నవతెలంగాణ-నిజాంపేట

రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గిరి ఎవరిని వరించేనోనని మూడు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్కంఠ భరితంగా ఎదురుచూస్తున్నారు. చిన్న శంకరంపేట, నిజాంపేట మండలాలు రామాయంపేట మార్కెట్ కమిటీ పరిధిలోకి వర్తిస్తాయి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడటంతో నామినేటెడ్ పోస్టులు ఖాళీ అయ్యాయి. రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ ఎస్‌టికి రిజర్వేషన్ చేయడం జరిగిందంటూ మండలంలోని కాంగ్రెస్ నాయకులు చర్చించుకుంటున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి రామాయంపేట మండలానికి చెందిన వ్యక్తికి చైర్మన్ పదవి దక్కిందని ఈ సారి మాత్రం నిజాంపేట లేదా శంకరంపేట మండలాలకు చెందిన నాయకులకే కేటాయించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు విన్నవించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. చిన్న శంకరంపేట మండలానికి చెందిన వ్యక్తికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కినట్లయితే నిజాంపేట మండలానికి వైస్‌చైర్మన్ పదవి ఇవ్వాలంటూ పలువురు కోరుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికి రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరిని వరించినో ఏమో అంటూ పలువురు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

రేపటి నుంచి రుద్రేశ్వరాలయం లో వార్షిక బ్రహ్మోత్సవాలు



- ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

నవతెలంగాణ - కొండపాక

తెలంగాణ ప్రాంతం ఆలయాలకు ప్రసిద్ధి. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయాల్లో ప్రతి ఏటా ఏదో రకమైన ఉత్సవాలు బ్రహ్మోత్సవాలు ఇప్పటికీ జరుగుతుంటాయి. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రుద్రేశ్వరాలయం లో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు వైభవోపేతంగా జరుగుతాయి.గురువారం రోజున వార్షిక బ్రహ్మోత్సవాలు గురు మదనానంద సరస్వతీ పీఠం పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అంకురార్పణ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. అలాగే మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం జరుగుతుంది. శుక్రవారం మహా శివరాత్రి మహోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి రుద్రేశ్వరుడికి సంతత ధార మహాభిషేకం, రుద్ర హవనం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, స్వామివారి సేవ రాత్రి లింగోద్భవ కాలంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం జరుగుతాయి. ఉత్సవాల ముగింపు రోజైన శనివారం ప్రత్యేక అభిషేకం, అర్చన, సహస్ర ఘటాభిషేకం, బ్రహ్మోత్సవాల సమాపనోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి.

రెవెన్యూ మేళా సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రెవెన్యూ మేళాను సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ అకుల రజిత వెంకన్న అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ మేళాను చైర్మన్ ఆకుల రజిత ప్రారంభించారు రెవెన్యూ మేళా ఈనెల 31 వరకు ప్రతి ఆదివారం, మంగళవారం, గురువారాల్లో, ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1-30 ని,ల వరకు ఉంటుందన్నారు. హుస్నాబాద్ పట్టణ ప్రజలందరూ సమస్యలతో పాటు రెవెన్యూ విభాగమునకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ మేళాలో పరిష్కరించుకోవాలని సూచించారు. గతంలో చెల్లించిన ఇంటి పన్ను రసీదు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లింకు డాక్యుమెంట్లు ఈసీ ఇంటి ఫోటో ఇంటి పర్మిషన్ ప్రతి అనుమతి కాపీలు రెవెన్యూ మేళాలో సమర్పించి తమ సమస్యలను పరిష్కరించుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న , బోజు రవీందర్, కమిషనర్ మల్లికార్జున్ , పురపాలక సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో గృహజ్యోతి కష్టాలు

- దరఖాస్తు చేసుకున్నా అమలు కాని 200 యూనిట్ల విద్యుత్



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలో భాగంగా అమలు చేస్తామని ఈనెల 1 నుండి 200 యూనిట్ల విద్యుత్తును అమలు చేస్తున్నట్టు ప్రకటించింది.అయినా ఇక్కడ అమలు గాకపోవడంతో 200 యూనిట్లు వినియోగించే లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి వచ్చి విద్యుత్ అధికారులే మీటర్లను పరిశీలించినట్లు మహిళలు చెబుతున్నారు. మున్సిపల్ అధకారులు ఆన్లైన్లో అప్లై చేశారు. పొరపాటు ఎక్కడ జరుగుతుందని అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న గృహ జ్యోతి లబ్ధిదారులను విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులు గుర్తించినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఆన్లైన్ సరిగా చేయకపోవడంతో పాటు లబ్ధిదారులు ఇబ్బందులు గురవుతున్నారు. దీంతో మహిళలు ఇంటి యజమానులు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయానికి భారీ సంఖ్యలో చేరుకొని తిరిగి ప్రజా పాలన దరఖాస్తు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఈనెల విద్యుత్ బిల్లు సమర్పించే ప్రయత్నం చేస్తున్నారు. గజ్వేల్ మున్సిపల్ ఆఫీసులో ప్రత్యేక కౌంటర్లు ఐదు వరకు ఏర్పాటు చేశారు. విద్యుత్ అధికారులు మాత్రం మున్సిపల్ ఆఫీసుకు పోయి తిరిగి దర్ఖా చేసుకోవాలని చెప్పడంతో కార్యాలయానికి చేరుకుంటున్నారు. ఫిబ్రవరి విద్యుత్ బిల్లు చాలామందికి మార్చి 1 నుండి తిరిగి వస్తుందని స్థానిక గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయానికి బారులు తీరారు. జనవరి, ఫిబ్రవరిలో విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి 200 యూనిట్ల మీటర్లను గుర్తించి సర్వే చేసిందని అది ఫలితం లేకుండా పోయిందన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తో పాటు నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో ఈ సమస్య తల ఎత్తిందని చెప్పాలి. సిద్దిపేట జిల్లాలో విద్యుత్ కలెక్షన్లు మూడు లక్షల ఇరవై వేల వరకు ఇంటి కలెక్షన్లు ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఇందులో 200 యూనిట్లు వినియోగించే లబ్ధిదారులు మాత్రమే ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆన్లైన్‌తో పాటు ఇంటి యజమానులు కూడా సరైన సమాచారంతో ప్రజాపాలన దరఖాస్తు నింపలేదని అధికారుల నుండి సమాచారం వస్తుంది. దీంతో చాలా గ్రామాల్లో తిరిగి అధికారులను ఆశ్రయిస్తున్నారు. మరోపక్క అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు 200 యూనిట్ల విద్యుత్తు ఉచిత విషయాన్ని గ్రామ గ్రామాన చాటింపు వేస్తున్నారు.

సాగునీటి వివాదం ప్రాణం తీసింది

- భూ తగాదాలో తమ్ముడిని కడతేర్చిన అన్న



నవతెలంగాణ-కోహెడ

తోడబుట్టిన వారితో ఉన్న బలం మరే ఇతర సంబంధాలకు సరికాదని చాటి చెప్పాల్సిన దానికి భిన్నంగా స్వంత తమ్ముడినే కడతేర్చిన సంఘటన మండలంలోని వింజపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వింజపల్లి గ్రామానికి చెందిన కొమ్ముల శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ముల తిరుపతిరెడ్డి ఇరువురు అన్నదమ్ములు తన తండ్రి ఇచ్చిన వ్యవసాయ భూమిని సాగుచేసుకుంటున్నారు. అలాగే పాలుగా వ్యవసాయ బావిని ఇరువురు వాడుకుంటున్నారు. దీంతో చెరొకరోజు వ్యవసాయ బావిని తమ పొలాలకు వాడుకుంటూ సాగుచేసుకుంటున్నారు. ఎప్పటిలాగే వ్యవసాయ పొలాన్ని తనవంతుగా మంగళవారం రోజు నీటని శ్రీనివాస్‌రెడ్డి తన వ్యవసాయ పొలాలకు వదిలివేయగా అక్కడికి చేరుకున్న అన్న తిరుపతిరెడ్డి మధ్య ఘర్షణ మొదలైంది. తనవంతు అంటే తనవంతనే భావన ఇరువురి మధ్య పెరగడంతో తిరుపతిరెడ్డి గొడ్డలితో శ్రీనివాస్‌రెడ్డిపై వేటు వేశాడు. దీంతో అక్కడికక్కడే శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలానికి ఏసీపీ వాసాల సతీష్ చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండపాక ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక ఎంపీపీ ర్యాగల సుగుణ దుర్గయ్య పై ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం 9 మంది ఎంపీటీసీల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మానం కాపీని గజ్వేల్ ఆర్డీవోకు అందజేశారు. కొండపాక మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు, కాంగ్రెస్ మూడు స్థానాల్లో, స్వతంత్ర అభ్యర్థులు మూడు స్థానాల్లో గెలిచారు. తర్వాత స్వతంత్రులంతా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అప్పుడు బందారం ఎంపీటీసీ ర్యాగల సుగుణను ఎంపీపీగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని గత కొంతకాలం నుంచి ప్రయత్నాలు సాగాయి. దాంతో 14 మంది ఎంపీటీసీల్లో కుకునూరు పల్లి ఎంపీటీసీ సభ్యురాలు మృతి చెందడంతో 13 మిగిలారు. అందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారితో పాటు తొమ్మిది మంది ఎంపీటీసీలు ఎంపీపీ పై అవిశ్వాసం ప్రకటించి ఆర్డీవోకు అందజేశారు.

ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-రాయపోల్

గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాల లబ్ధి కొరకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రమును ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుంచి సంబంధిత గుర్తింపు కార్డులను సేకరించి డాటా కరెక్షన్ చేయడం జరుగుతుందని ఎంపీఓ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం రాయపోల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముత్తాలిఫ్,ఎల్కల్ ఎంపిటిసి వెంకటయ్య, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలకు నీటిని విడుదల చేయాలి



నవతెలంగాణ-రాయపోల్

యాసంగి వరి పంటలు ఎండిపోతున్నాయని కొండపోచమ్మ ప్రాజెక్టు కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను రక్షించడానికి రైతులకు సహకారం అందించాలని లింగారెడ్డి పల్లి గ్రామ రైతులు తహసిల్దార్ దివ్యకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగికాలంలో రైతులు పెద్ద ఎత్తున వరి పంటలు సాగు చేస్తున్నారని తీరా చూస్తే పంటలు పూర్తికాకముందే నీటి ఎద్దడితో వరి పంటలు ఎండిపోతున్నాయన్నారు. అలాగే భూగర్భ జల మట్టం తగ్గిపోయి బోర్లు కూడా పోయడం లేదన్నారు. సిద్దిపేట జిల్లాలోని అనంతసాగర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ భారీ ప్రాజెక్టులు ఉన్నప్పటికీ సుక్క నీరురాక వరి పొలాలు బీటలు వారుతున్నాయన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి రామాయంపేట కెనాల్ ద్వారా రాయపోల్ మండలంలో అంకిరెడ్డిపల్లి, రామారం, గొల్లపల్లి, రాంసాగర్ గ్రామాల చెరువులకు నీటిని తరలించడం జరిగిందని,రాంసాగర్ ఎల్లమ్మ చెరువు నుంచి నీటిని విడుదల చేస్తే లింగారెడ్డి పల్లి విశ్వనాథ చెరువు నిండుతుందని, ఈ చెరువు ద్వారా లింగారెడ్డి పల్లి గ్రామంలో ఎండిపోతున్న వరి పొలాలకు సాగునీరు అందించవచ్చున్నారు. ఎండిపోతున్న పంటలను దృష్టిలో పెట్టుకొని తహసిల్దార్ వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలలన్నారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి పల్లి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

చదువును నిత్య జీవితానికి అన్వయించుకోవాలి

- ఎస్సై అపూర్వ రెడ్డి



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

చదువును నిత్య జీవితానికి ఉపయోగించుకొని సమస్యలను ఎదుర్కొంటే ముందుకుసాగాలని ఎస్ఐ అపూర్వ రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని ఇర్కోడు మోడల్ స్కూల్ లో గర్ల్స్ చైల్డ్ ఎంపవర్మెంట్ క్లబ్ ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వయసుతో సంబంధం లేని సమస్యలతో పోలీస్ స్టేషన్ ఆశ్రయిస్తున్నారని చెప్పారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల సామాజిక సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని తెలిపారు. ఉన్నత చదువులు చదివిన అమ్మాయిలు చిన్నచిన్న సమస్యలకి ధైర్యం కోల్పోతున్నారని సూచించారు. ప్రతి అమ్మాయి మానసిక స్థైర్యాన్ని కలిగి ఉండాలని అన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారి ముక్తేశ్వరి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తు కోసం వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రముఖ న్యాయవాది రేణుక మాట్లాడుతూ సమాజంలో మానవ విలువలు కోల్పోతున్నాయని అమ్మాయిల పట్ల అనేక రకాలుగా వివక్ష జరుగుతుందన్నారు మేధావులు ఇలాంటి వాటిపై మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత మాట్లాడుతూ అమ్మాయిలకు ఏర్పడిన అనారోగ్య సమస్యలను తల్లితో పంచుకోవడంలో మొహమాట పడుతున్నారని తద్వారా అనారోగ్య సమస్య వ్యాధిగా మారి పోతుందని చిన్న వయసులోనే రక్తహీనతను కలిగి ఉంటున్నారని పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు ఉపాధ్యాయులు పవన్ కుమార్ ,దేవేందర్, పద్మజ, ఏఎన్ఎం శోభ, తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర ఉర్దూ భాష అకాడమీ చైర్మన్‌కు శ్రీనివాస్ రెడ్డి శుభాకాం క్షలు



నవతెలంగాణ-తొగుట

తెలంగాణ రాష్ట్ర ఉర్దూ భాష అకాడమీ చైర్మన్ గా నియమితులైన తాహేర్ బిన్ హమ్దాన్ మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి చైర్మెన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ తాహే ర్ బిన్ హమ్దాన్ రాష్ట్ర ఉర్దూ భాషా అకాడమీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెరుకు విజయ్ రెడ్డి(అమర్), రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు అఖిలేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల పాముల పర్తిలో 1998- 99 లో చదు వుకున్న 10వ తరగతి చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్నారు. స్వచ్చందంగా వివరాలు సేకరించి సుమారు 60 వేల ఖర్చుతో తమ జ్ఞాపకార్థం పాఠశాలలో జ్ఞానసరస్వతి విగ్రహాన్ని ప్రతిష్టించాలని నిర్ణయించుకున్నారు.

మల్లన్న భూములు అన్యాక్రాంతం

- పట్టించుకోని ఆలయ ఈవో
- సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలిసి ఆలయ భూములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ భూములు కాపాడాల్సిన ఆలయ ఈవో పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. గతంలో లక్షలు వెచ్చించి ప్రహరీ గోడలు నిర్మాణాలు చేపట్టి వదిలేశారని, ఇటీవల కొందరు ఓ నాయకుని అండతో గోడలను కూల్చి వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఆలయ భూములు కాపాడాల్సిన ఈవో సదరు నాయకునితో దోస్తీ చేస్తున్నాడని అన్నారు. ఇప్పటికైనా ఆలయ ఈవో బాధ్యతతో వ్యవహరించి భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలను ఏకం చేసి ఆలయ గోపురం ముందు దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాజ మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, బద్దిపడ కృష్ణారెడ్డి, మండల నాయకులు తేలు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు, తాడూరి మల్లేశం, సార్ల యాదయ్య తాడూరి నరేష్, ఆరుట్ల రవీందర్, నీల బిక్షపతి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయం పూటే పనులు పూర్తి చేసుకోవాలి

- డిఆర్డీవో జయదేవ్



నవతెలంగాణ-మర్కుక్

ఉపాధి హామీ కూలీలు వేసవిని దృష్టిలో ఉంచుకుని పనులను ఎండవేడి మికి గురికాకుండా ఉదయ ం పూటే పనులకు వచ్చి సకాలంలో పనులు పూర్తి చేసుకోవాలని డిఆర్డీవో జయదేవ్ సూచించారు. పనుల్లేని కూలీలకు ఉపాధి హామీ పనులు ఎంతగానో తోడ్పడు తాయన్నారు. మండలంలోని దామరకుంట, వర్ధారజ్ పూర్ జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అఫ్జల్, ఎంపీవో రాజలింగం,ఈసీ రాజు,పంచాయితి కారగయదర్శి శైలేష్,తదితరులున్నారు

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వత్తిడి

నవతెలంగాణ-ములుగు: మండలంలోని ప్రైవేటు పాఠశాల యజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల ఒత్తిడిని తెస్తున్నాయి. ఫైనల్ ఎగ్జామ్స్ వచ్చేస్తున్న తరుణంలో ఈ సమయంలోనే ఫీజులు వసూలు చేసుకునేందుకు పాఠశాల యజమాన్యాలు సిద్ధమైనాయి. విద్యార్థులు ఫైనల్ ఎగ్జామ్స్ వస్తుండడంతో ఫీజులు చెల్లించని విద్యార్థులు అటు ఫీజులు చెల్లించాలా ఇటు ఫైనల్ ఎగ్జామ్స్ కి సిద్ధం కావాలా అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారు. కొన్ని పాఠశా లలో మాత్రం ఫీజులు చెల్లించకుంటే పాఠశాలకు రావద్దు అని నిబంధనలు కఠిన తరం చేశారనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. ఫీజులు చెల్లించలేదని పని ష్మెంట్లు ఇచ్చే పాఠశాలలను విద్యాధికారులు తనిఖీ చేస్తున్నట్లు సమాచారం.

కఠిన చర్యలు తీసుకుంటాం

ఎంఈవో ఉదయభాస్కర్



ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులపై ఫీజుల భారం మోపకుండా చూడాలని, ఒకవేళ అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి తెలిపారు

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానం

- గిరిజన అభివద్ధి శాఖ అధికారి ఎం ఫిరంగి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్: జిల్లా సమీకృత కార్యాలయంలో మంగళవారం గిరిజన అభివృద్ధి శాఖ నుండి జిల్లాలోని విద్యార్థినీ, విద్యార్థుల కోసం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్, రామంతపూర్‌లలో ఒకటో తరగతి ఇంగ్లిష్ మీడియం లో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ స్కూల్ లో చేరబోయే విద్యార్థుల యొక్క పుట్టినతేదీ 01-06-2017 నుండి 31-05-2018 లోపు ఉండాలి. అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు తమ తమ సర్టిఫికెట్లతో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయము యందు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన అభివద్ధి శాఖ అధికారి ఎం ఫిరంగి తెలిపారు.

సమస్యను పరిష్కరిస్తారా?జఠిలం చేస్తారా?



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గూడెం గ్రామంలో నెలకొన్న మూడెకరాల భూ పంపిణీ సమస్యలను ప్రభుత్వాధికారులు పరిష్కరిస్తారా? ఇంకా జఠిలం చేసి అన్యాయం చేస్తారా? అని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యలయ అవరణం ముందు మూడెకరాల భూ పంపిణీలో సమన్యాయం చేయాలని పలువురు గూడెం గ్రామస్తులు చేపట్టిన నిరాహారదీక్షకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. పదేళ్లు పరిపాలన సాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం మూడెకరాల భూ పంపిణీ సమస్యను పరిష్కరించకుండా జఠిలం చేసిందని..కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ప్రత్యేక చొరవ చూపి భూ సమస్యను పరిష్కరించాలని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి సూచించారు. మండలాధ్యక్షుడు కొలిపాక రాజు,సంగ రవి,చాడ వెంకట రెడ్డి తదితరులు హజరయ్యారు.

ఇండ్ల లబ్ధిదారులను గ్రామ సభలో ఎంపిక చేయాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట రెడ్డి సూచన

నవతెలంగాణ-బెజ్జంకి : ప్రభుత్వం ఈ నెల 11న ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని మంగళవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. గత ప్రభుత్వం అర్హులైన వారందరికి డబుల్ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రగల్భాలు పలికి మోసం చేసిందని ఈ ప్రభుత్వమైన అర్హులకు న్యాయం జరిగేల మార్గదర్శకాలు రూపొందించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని వెంకట రెడ్డి తెలిపారు.బేగంపేట గ్రామంలో డబుల్ ఇండ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన స్థలంపై నీలినీడలు కమ్ముకున్నాయని గ్రామ సభ ద్వారా అర్హులను ఎంపిక చేసి స్థలం పంపిణీ చేయాలని ప్రభుత్వానికి,స్థానిక ఎమ్మెల్యేకు అయన విజ్ఞప్తి చేశారు.

కొండపాక ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన

నవతెలంగాణ - కొండపాక: కొండపాక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి సందర్శించి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. స్వయం పాలనతో బాధ్యతలు తెలుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కొండపాక కాంప్లెక్స్ హెచ్ఎం సముద్రాల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ చారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న ఎంటిబి సైక్లింగ్ సెలెక్షన్స్

నవతెలంగాణ-సిద్దిపేట: ఈనెల 7న పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని ఖేలో ఇండియా సెంటర్ వద్ద జిల్లా సైక్లింగ్ ఎంటీబీ సెలెక్షన్స్ ఉంటాయని ఖేలో ఇండియా సెంటర్ కోచ్ సంజీవ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అండర్ 14, 16, 18, 23, మెన్, ఉమెన్ విభాగాలలో ఎంటిబి సెలెక్షన్లు ఉంటాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, బోనఫైడ్ తో హాజరుకావాలని సూచించారు. ఉదయం 6 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9640760193 నెంబర్ ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు బోజన సామాగ్రి అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి: మండల పరిధిలోని గుండారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు గిరిబాబు తన కూతురు ప్రజ్వల జన్మదినం సందర్భంగా మంగళవారం బోజన సామాగ్రిని అందజేశారు. అనంతరం ప్రజ్వల జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ బృందం రవీందర్, తిరుపతి, తిరుపతిరెడ్డి, రాములు, సంధ్యారాణి, ఆత్మాధికారి చరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

